## పొంగల్ టోకెన్ల పంపిణీ ప్రారంభం

చెన్నై: పొంగల్ బహుమతులు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ల పంపిణీ ప్రారంభమైంది. రేషన్ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి టోకెన్లు ఇస్తున్నారు. ఈ ఏడాది పొంగల్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా కిట్ అందిస్తున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సంబంధిత రేషన్ దుకాణాల ద్వారా అందించనున్న పొంగల్ బహుమతుల టోకెన్ల పంపిణీ ప్రారంభమైంది. ఈ టోకెన్లలో బహమతులు పొందాల్సిన తేది, సమయం తదితరాలున్నాయి. టోకెన్లలో తెలిపిన ప్రకారం, లబ్దిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి పొంగల్ బహుమతి పొందాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 100 మంది, మధ్యాహ్నం 100 మందికి బహుమతి అందించేలా నిర్ణయించారు. రేషన్ దుకాణాల వద్ద ప్రజల రద్దీని అరికట్టేలా టోకెన్ల విధానం అమలుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 345 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 జనవరి 2025 ఆదివారం పేజీలు : 4

# జనవరి 26 నుంచి...

# రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

## కేబినెట్ కీలక నిర్ణయాలను మీడియాకు వెల్లడించిన సీఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణలో జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం' అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి వర్గ నిర్ణయాలను సీఎం మీడియాకు వివరించారు. "తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి నూతన సంవత్సరంలో మంచి జరగాలి. రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తాం. ప్రతి ఎకరాకు ఏడాదికి రూ. 12వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అని నామకరణం చేశాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేస్తాం" అని సీఎం ప్రకటించారు.

**భూమి లేకపోయిన రైతు భరోసా.. సీఎం రేవంత్ కీలక ప్రకటన...** రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి ఎకరానికి ఏటా రూ. 12 ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భూమి లేకున్న రైతు భరోసా ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి పండుగకు ముందే తీపి కబురు చెప్పారు. భూమి లేని వారికి కూడా రైతు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. భూమిలేని కుటుంబాలకు ఏడాదికి రూ. 12వేలు ఇస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట భూమిలేని కుటుంబాలకు సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. జనవరి 26నుంచి కొత్త పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతు భరోసా ఇవ్వమని తేల్చిచెప్పారు. గుట్టలు, రో డ్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా ఇవ్వమోమని సీఎం రేవంత్ అన్నారు.



## రైతులకు పరిహారం చెల్లించేలా ఆ చట్ట సవరణ చేయాలి

ఢిల్లీ: పచ్చిరొట్ట ఎరువుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. అన్ని రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇవాళ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల హాజరయ్యారు. 53,617 మెట్రిక్ టన్నుల సోయా సేకరించినట్లు తుమ్మల వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... వచ్చే ఐదేళ్లలో 4లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ గెలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని అన్నారు. పసుపు, మిర్చి పంటకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. రైతులకు పరిహారం చెల్లించేలా విత్తన చట్టసవరణ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కాగా తెలంగాణ కేబినెట్ సమావేశం శనివారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ భేటీ అయింది. రైతుభరోసా విధివిధానాలను కేబినెట్ ఖరారు చేసింది. కొత్త రేషన్‌కార్డులు, సమగ్ర కులగణనపై భేటీలో చర్చించారు. భూమిలేని పేదలకు భృతి, సన్నబియ్యం పంపిణీపై చర్చించారు. టూరిజం, క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ, సాగునీటి సంఘాల పునరుద్ధరణపై చర్చించారు.

## కేసీఆర్ జపం లేకుండా రేవంత్ ఉండలేరు.. కేటీఆర్ సెటైర్



సిరిసిల్ల, జనవరి 4: కాంగ్రెస్ హామీలపై మరోసారి ఫైర్ అయ్యారు మాజీ మంత్రి కేటీఆర్. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇప్పుడు చేతులెత్తేస్తున్నారంటూ మండిపడ్డారు. తులం బంగారం, రైతు భరోసా, ఏకకాలంలో రుణమాఫీ ఏమయ్యాయని ప్రశ్నించారు. శనివారం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో అడ్డగోలు, పనికిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులు ఎత్తేస్తున్నారని విమర్శించారు. తులం బంగారం ఇవ్వడానికి బంగారం దొరుకుతలేదా అంటూ ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. అలాగే ఏక కాలంలో రుణమాఫీ ఏమైందని ప్రశ్నల వర్షం కురిపించారు. రైతులు ప్రమాణ పత్రం ఎందుకు రాసివ్వాలని అడిగారు. రెండో పంటకు రైతు భరోసా ఇస్తారా లేదా అని వరుస ప్రశ్నలు సంధించారు. మూడో పంటకు ఎందుకు ఇవ్వరు అని మమ్మల్ని ప్రశ్నించిన రేవంత్.. కనీసం రెండో పంటకు ఇవ్వడం లేదని వ్యాఖ్యలు చేశారు. "నువ్వు చీఫ్ మినిష్టర్ వా.. కటింగ్ మాస్టర్ వా" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జపం లేకుండా రేవంత్ ఉండలేరంటూ సెటైర్ విసిరారు. రేవంత్ రెడ్డి అబద్దాల కోరు అని.. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణకు గుండు సున్నా తెచ్చారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా..** మరోవైపు రైతుభరోసాపై ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. అలాగే ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "రైతు భరోసా ఇచ్చింది లేదు.. రుణమాఫీ సక్కగా చేసింది లేదు.. పెన్షన్ పెంచింది లేదు. ఆరు గ్యారెంటీల అమలుకు దిక్కులేదు.. కానీ.. ఆగమేఘాల మీద అనవసరమైన వాటి కోసం వేల కోట్ల ఖర్చు పెట్టేందుకు మనసొచ్చిందా? నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లు.. అక్షరం మార్పు కోసం అక్షరాల 1000 కోట్ల ఖర్చా? వెయ్యి కోట్లు కాదు లక్ష కోట్లు ఖర్చుపెట్టినా.. తెలంగాణ అస్థిత్వాన్ని చెరపలేవు! నాలుగు కోట్ల గుండెలపై కెసిఆర్ చేసిన సంతకాన్ని మార్చలేవు..!" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



## గత ప్రభుత్వాలు గ్రామాభివృద్ధిని విస్మరించాయి

దిల్లీ: దేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని.. అటువంటి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దిల్లీలో నిర్వహించిన 'గ్రామీణ భారత మహోత్సవం 2025' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెనకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని.. దాంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు ఎక్కువయ్యాయన్నారు. ఫలితంగా పట్టణాల్లోనూ పేదరికం పెరిగిపోయిందని వాపోయారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరం పెరుగుతూనే ఉందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలు గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరమని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో భారత్‌లోని మారుమూల ప్రాంతాల ప్రజలు ఆ మహమ్మారిని ఎలా ఎదుర్కొంటారని ప్రపంచ దేశాలు అనుమానం వ్యక్తంచేసినట్లు మోదీ పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందన్నారు.




# తెలంగాణలో మళ్లీ....

# సైకిల్ సవారీ!

## తెలంగాణ గట్టు మీద చంద్రబాబు స్కెచ్ ఏంటి?

హైదరాబాద్ : సైకిల్ పంక్చర్ అయింది..చైన్ కూడా తెగిపోయింది. ఎంత తొక్కినా ముందుకు కదలదనుకున్నారు. కానీ ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. పడిలేచిన కెరటమై.. పోగొట్టుకున్న చోటే వెతుక్కునే ప్రయత్నం మొదలుపెట్టబోతుందట పసుపు పార్టీ. ఒకప్పుడు నైజాం గడ్డ మీద ప్రభంజనం సృష్టించిన టీడీపీ..పూర్వవైభవం కోసం సరికొత్త వ్యూహాలు రెడీ చేస్తోందట.

సైకిల్ పార్టీ తెలంగాణలో మళ్లీ సవారీ చేయబోతుందా? తెలంగాణ గట్టు మీద చంద్రబాబు వేస్తున్న స్కెచ్ ఏంటి?

**సర్పంచ్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ పోటీ?..** తెలంగాణపై మళ్లీ ఫోకస్ పెట్టారు టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో డీలా పడ్డ పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా అడుగులు వేస్తున్నారట. సంక్రాంతి తర్వాత పూర్తిస్థాయిలో తెలంగాణ మీదే నజర్ పెట్టబోతున్నారట. జనవరి చివరి కల్లా తెలంగాణ టీడీపీ అధ్యక్ష నియామకం చేపట్టి, కార్యవర్గాన్ని ప్రకటించాలని భావిస్తున్నారట చంద్రబాబు. త్వరలో తెలంగాణలో జరగనున్న సర్పంచ్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసే దిశగా తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారట చంద్రబాబు. ఇందులో భాగంగా ప్రతీ 15-20 రోజులకు ఒకసారి హైదరాబాద్‌లో నేతలు, కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా తర్వాత తెలంగాణ టీడీపీకి అధ్యక్షుడు లేకుండా పోయారు. అందుకే ఇంకా ఆలస్యం చేయకుండా టీటీడీపీకి వెంటనే అధ్యక్షుడిని నియమించడంతో పాటు పూర్తిస్థాయిలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారట.

**సంక్రాంతి తర్వాత తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి నియామకం..!** గత కొన్ని రోజులుగా టీటీడీపీ అధ్యక్షుడి ఎంపిక, పార్టీ కార్యవర్గంపై చేస్తున్న కసరత్తు..ఫైనల్ స్టేజ్‌కు చేరుకుందని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వర్గాలు చెబుతున్నాయి. సంక్రాంతి తర్వాత తెలంగాణ టీడీపీ అధ్యక్ష్యుడ్ని నియమిస్తారని టాక్. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు సాగుతుండగా, జనవరి మూడో వారంలో తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారని తెలుస్తోంది.

**టీటీడీపీ అధ్యక్షుడిగా తీగల కృష్ణారెడ్డికి పగ్గాలు?** తెలంగాణ టీడీపీకి ఎవరిని అధ్యక్షుడిగా నియమించాలన్న దానిపై సమాలోచన చేసిన చంద్రబాబు ఓ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం టీడీపీలో ఉన్న అరవింద్ కుమార్ గౌడ్‌తో పాటు పార్టీలో చేరబోతున్న తీగల కృష్ణారెడ్డి, ఇటీవల పార్టీ సభ్యత్వం తీసుకున్న బాబు మోహన్‌లు తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారట. అయితే హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డివైపే చంద్రబాబు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి తర్వాత టీటీడీపీ అధ్యక్షుడిగా తీగల కృష్ణారెడ్డికి పగ్గాలు అప్పగించడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ప్రముఖ నటుడు, మాజీమంత్రి బాబు మోహన్‌ను టీటీడీపీ వర్కింగ్ ప్రెసిండెంట్‌గా..అరవింద్ కుమార్ గౌడ్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించాలని చంద్రబాబు డిసైడ్ అయినట్లు సమాచారం. ఇప్పటికే తీగల కృష్ణారెడ్డి చంద్రబాబును కలిశారు. తాను త్వరలో టీడీపీలో చేరుతానని ఆయన ప్రకటించారు. తెలంగాణలో టీడీపీకి అభిమానులు ఉన్నారని.. త్వరలోనే పార్టీకి గత వైభవం తీసుకొస్తానన్నారు. తీగల కృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానం టీడీపీలోనే స్టార్ట్ అయింది. టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచి హైదరాబాద్ మేయర్‌గా పని చేశారాయన. దాంతో తిరిగి సొంత గూటికి చేరి పార్టీ పగ్గాలు చేపట్టేందుకు రెడీ అయ్యారు తీగల కృష్ణారెడ్డి. వాస్తవానికి తెలంగాణలో టీడీపీకి అభిమానులు బానే ఉన్నారు. హైదరాబాద్, ఖమ్మంలో టీడీపీకి మంచి పట్టుంది. టీడీపీ కోర్ ఓటు బ్యాంకైన కమ్మ ఓటర్లు హైదరాబాద్‌లో పలు నియోజకవర్గాల్లో గెలుపోటములను డిసైడ్ చేస్తారు. మరికొన్ని సెగ్మెంట్లలో సెటిలర్ల ఓట్లు ఎక్కువగానే ఉంటాయి. ఖమ్మంలోనూ కమ్మ ఓటర్లు ఉండటం..విజయవాడకు బార్డర్‌గా ఉన్న జిల్లా కావడంతో అక్కడ కూడా టీడీపీకి అంతో ఇంతో పట్టుంది.

**తెలంగాణలో ప్రభావం చూపేంతగా బలపడాలనే భావన..** అయితే గెలిచేంత పట్టు ఉందా లేదా అన్నదే చర్చ. ఎలా అయినా తెలంగాణలో ప్రభావం చూపేంతగా బలపడాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలుపెట్టగా..కనీసం 10 లక్షల మందిని సభ్యులుగా చేర్పించాలని టార్గెట్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత తెలంగాణలో జరిగే సర్పంచ్ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# సంపాదకీయం

## నితీష్ కి కన్ను గీటిన లాలూ ఎన్డీయేలో కలవరమేనా ?

బీహార్ సీఎం నితీష్ కుమార్ నిజాయతీని ఎవరూ శంకించాల్సిన పని అయితే లేదు. కానీ ఆయన రాజకీయ జీవితంలో పార్టీలను మారుస్తూ కొత్త బంధాలను ఎప్పటికపుడు పెనవేసుకుంటూ సాగిన ధోరణులను మాత్రం అంతా వ్యతిరేకిస్తూనే ఉంటారు. దేశంలో ఇంతలా పార్టీలను మార్చే నేత మరొకరు ఉన్నారా అనిపించేలా నితీష్ కుమార్ అటూ ఇటూ మారుతూ తన రాజకీయ నీతి విషయంలో సందేహాలే మిగిల్చారు. ఆయన 2020లో బీహార్ లో ఎన్డీయే తరఫున ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఈ అయిదేళ్ల కాలంలోనే ఆయన బీజేపీ నుంచి ఇండియా కూటమికి వెళ్లారు. ఒక విధంగా చూస్తే ఇండియా కూటమి ఏర్పాటు వెనక నితీష్ కుమార్ ఉన్నారని చెప్పాల్సిందే. ఆయన ఇదంతా చేసింది ఇండియా కూటమికి సారధి కావాలని ఆ మీదట అవకాశం ఉంటే దేశానికి ప్రధాని కావాలని భావించారు. అయితే ఆయనకు ఇండియా కూటమిలో కీలక స్థానం దక్కకుండా చేసింది తోటి బీహారీ నేత ఒకనాటి సహచరుడు ఆర్జేడీ అధినేత అయిన లలూ ప్రసాద్ యాదవ్ నే అని అంటారు. ఆయన రాహుల్ గాంధీని కాంగ్రెస్ ని వెనకేసుకుని వస్తూ వారికే పెద్ద పీట ఉండాలని కోరుకుంటూ వచ్చారు. దాంతో నితీష్ కి ఇండియా కూటమిలో ఉంటే ఏమి జరుగుతుందో సీన్ మొత్తం అర్ధం అయింది. దాంతో ఆయన చేసేది లేక మళ్లీ గో టూ పెవిలియన్ అన్నట్లుగా ఎన్డీయే కూటమిలోకి వచ్చారు. అలా నితీష్ గత ఏణ్ణర్ధ కాలంగా ఎన్డీయే కూటమితోనె ఉన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీహార్ లో ఎన్డీయే అత్యధిక స్థానాలు సాధించింది. అంతే కాదు కేంద్రంలో మూడవసారి అధికారం అందుకుంది. నితీష్ నాయకత్వంలోని జేడీయూ కూడా కీలక మంత్రి పదవులు తీసుకుంది. ఎన్డీయేలో మూడవ అతి పెద్ద పార్టీగా జేడీయూకి గుర్తింపు ఉంది ఇక 2025 అక్టోబర్ లో బీహార్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ పేరునే ప్రకటిస్తారు అంటున్నారు. దాంతో ఆయన కూడా ఆ వైపునే ఉండి ఎన్నికల్లో పోరాడాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మాజీ సీఎం లాలూ యాదవ్ నితీష్ కుమార్ కి కన్ను గిటారు. ఇండియా కూటమిలోకి నితీష్ కి ఆహ్వానమని అన్నారు. ఆయన ఎపుడు వచ్చినా తలుపులు తెరచే ఉంటాయని కూడా రెడ్ కార్పెట్ ని పరచారు రాజకీయంగా చూస్తే ఇవి ఎన్డీయేని కలవరపరచే వ్యాఖ్యలే అంటున్నారు. కేంద్రంలో బొటాబొటీ మెజారిటీతో ఎన్డీయే సర్కార్ ఉంది. నితీష్ కుమార్ మద్దతు చాలా కీలకంగా మారింది. ఆ ఊతకర్రను లాగేయాలని ఇండియా కూటమి చూస్తోందా అన్న చర్చ అయితే సాగుతోంది. ఇపుడు నితీష్ ని తమ వైపు తిప్పుకుంటే కేంద్రంలో మోడీ సర్కార్ కి కష్టాలు తప్పవని అంటున్నారు. అందుకే తెలివిగా నితీష్ కి తలుపులు తెరచి ఉంచామని లాలూ చెప్పారని అంటున్నారు అయితే దానికి బదులుగా నితీష్ కుమార్ ఏమి చెబుతున్నారు లాలూ అంటూ గట్టిగానే మాట్లాడారు. తాను ఎన్డీయే కూటమిలోనే ఉంటాను అని చెప్పారు. కానీ గతంలో రెండు సార్లు ఎన్డీయే కూటమి నుంచి ఫిరాయించి బయటకు వచ్చిన నితీష్ పట్ల అందరిలోనూ సందేహాలు ఉన్నాయి. మరి నితీష్ కుమార్ ని ముందు పెట్టి ఎన్డీయే కూటమికి భారీ షాక్ ని ఇచ్చేందుకు ఇండియా కూటమి కొత్త ఏడాదిలో సరికొత్త వ్యూహాలకు తెర తీస్తోందా అన్న చర్చ అయితే సాగుతోంది. మొత్తానికి 2025లో అడుగుపెడుతూనే లాలూ బాంబు పేల్చారు. నితీష్ వైపే ఇపుడు ఎన్డీయే పెద్దల చూపులు ఉన్నాయని అంటున్నారు.

# అధిక భారం.. అడుగడుగునా ఛిద్రం



గోదావరిఖని : సుదీర్ఘ కాలం వాహనాలు నడిచేందుకు నిర్మించిన రాజీవ్ రహదారి తక్కువ సంవత్సరాల్లోనే మరమ్మతు దశకు చేరుకుంది. భారీ వాహనాలు, అధిక లోడు వాహనాలు తిరుగుతుండటంతో అతి తక్కువ కాలంలోనే గుంతలు పడటంతో పాటు తారు లేచిపోతోంది. ఉమ్మడి జిల్లాలో గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు వంద కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పాటు సామర్థ్యానికి మించి సరకు రవాణా చేస్తున్నారు.

**ఒకే వైపు ఎక్కువ**

గోదావరిఖని నుంచి కొత్తపల్లి వరకు విస్తరించి ఉన్న రాజీవ్ రహదారిపై హైదరాబాద్ వెళ్లే మార్గంలోనే ఎక్కువగా గుంతలు ఉన్నాయి. బసంత్‌నగర్, పెద్దపల్లి, సుల్తానాబాద్, తిమ్మాపూర్, గుండ్లపల్లి ప్రాంతాల్లో ఎక్కువ శాతం తారు లేచిపోయింది. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో ఎక్కువ ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. నిర్వహణ సంస్థ ఇటీవలే కొన్ని చోట్ల మరమ్మతు చేసింది. ఈ చిత్రం పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ సమీప కన్నాల వద్ద రాజీవ్ రహదారి. తారు లేచిపోయి పగుళ్లు చూపుతున్న రహదారి. మరి కొద్ది రోజుల్లో పూర్తిగా గుంత పడేందుకు ఆస్కారం ఉంది. అక్కడ రహదారి గట్టిదనం దెబ్బతింది. మరికొన్ని వాహనాలు అధిక బరువుతో నడిస్తే గుంతపడుతుంది.

రోడ్డు నిర్మాణంలో ఇవి పాటిస్తారు

ముందుగా మట్టి నమూనాలు పరీక్షిస్తారు.

వాహనాలు ఎన్ని తిరుగుతాయో అంచనా వేస్తారు.

రహదారి జీవిత కాలాన్ని కూడా అంచనా వేసి నిర్మిస్తారు.

ఇక్కడ కనిపిస్తున్న వాహనం సామర్థ్యానికి మించి సరకును తీసుకెళుతుంది. ఈ వాహనానికి ఉన్న బాడీ కంటే ఎక్కువ ఎత్తులో సరకు నింపుకొన్నారు. దీని ప్రభావంతో రహదారి దెబ్బతింటోంది.

రహదారి ఛిద్రానికి ఇవీ కారణాలు

ఉమ్మడి జిల్లాలో క్వారీలు, గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి.

ఎన్టీపీసీకి చెందిన బూడిదతోపాటు ఇసుక, కలప, ఉనుక, గ్రానైట్, ఇతర సరకుల లోడుతో నిత్యం వాహనాలు వెళ్తుంటాయి.

భారీ యంత్రాలను కూడా ఇదే రహదారిపై నుంచి రవాణా చేస్తున్నారు.

మూడో వంతు భారీ వాహనాలే..

రోజుకు 12 వేల వరకు వాహనాలు తిరుగుతుంటాయి.

భారీ వాహనాలు 4,500 వరకు ఉంటాయి.

సామర్థ్యానికి మించి వెయ్యి వాహనాలు వెళ్తున్నాయి.

సామర్థ్యానికి మించి రవాణా చేస్తే కేసులుసామర్థ్యానికి మించి రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రతి వాహనానికి నిర్దేశిత సామర్థ్యం ఉంటుంది. వాహన బరువుతో కలిపి నిబంధనల మేరకు ఉన్న బరువు వరకు మాత్రమే రవాణా చేయాలి. అంతకంటే ఎక్కువగా సరకు ఉంటే చర్యలు తీసుకుంటాం. రహదారుల పై నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. మా దృష్టికి వచ్చిన వాటిపై పరిశీలించి వాహనాలను సీజ్ చేస్తున్నాం. రంగారావు, జిల్లా వాహన తనిఖీ అధికారి

# ఖాళీల భర్తీ లేదు.. పరికరాలు లేవు



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో సర్వేశాఖలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీ చేపట్టకపోవడంతో పాటు, అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో దరఖాస్తులు పరిష్కారం కావడం లేదు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో 4 ఏడీ పోస్టులకు ఒక్కరే ఉండగా ఇతర జిల్లాల్లో ఇన్‌స్పెక్టర్లతో వెళ్లదీస్తున్నారు. సిరిసిల్ల జిల్లాలో ఇన్‌స్పెక్టర్ పోస్టు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ 2 పోస్టులు, సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ పోస్టులు 15, కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్ 5, సీనియర్, జూనియర్ సహాయకులు తదితర అన్నీ కలిపి 9 పోస్టులు ఖాళీ ఉన్నాయి. సర్వేను వేగవంతంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు అవసరమైన డీజీపీఎస్, హౌస్ స్టేషన్ తదితర అధునాతన పరికరాలు అందుబాటులో లేవు.

**హద్దుల కచ్చితత్వంపై నిర్లక్ష్యం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రికార్డుల నిర్వహణ, క్రమబద్ధీకరణ కోసం ఆర్‌వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్), పట్టాదారు పాసుబుక్ చట్టం 1971 ఏర్పాటైంది. ఇందులో సర్వే, హద్దుల చట్టం 1923 ప్రకారం లావాదేవీలు జరిగిన భూములను ఎప్పటికప్పుడు సర్వే చేసి పటాలతో నవీకరించాలని స్పష్టంగా పేర్కొంది. అయితే భూముల క్రయవిక్రయాలు జరిగినపుడు, సదరు భూమి విస్తీర్ణానికి అనుగుణంగా రీసర్వే చేసి అధికారి ధ్రువీకరించిన పటం(సర్వే మ్యాప్) తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు జతచేయాలి. సాదా బైనామా భూముల విషయంలో ఇదే నిబంధన వర్తిసుంది. నిజాం కాలంలో 1936లో మొదటి సారి ఆర్‌వోఆర్ చట్టం రాగా ఆ తరువాత పాత చట్టం రద్దవుతూ 1948, 1971, 2020లో కొత్త చట్టాలు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో భూముల సాధారణ క్రయవిక్రయాలతో పాటు 1989, 1992, 2005, 2018తో పాటు పలుమార్లు వేల సంఖ్యలో సాదా బైనామా దరఖాస్తులు పరిష్కరించారు. రిజిస్ట్రేషన్ తదితర పత్రాల్లో హద్దుల వివరాలు నమోదు మినహా రీసర్వే చేసిన సబ్ డివిజన్ మ్యాపు జతపరచాలనే నిబంధనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. యాజమాన్య హక్కులు బదిలీ అయినప్పటికీ హద్దుల విషయంలో కచ్చితత్వానికి అవకాశం లేకుండా పోయింది.

**సమస్యలు పరిష్కరించాలి**

**వెంకటరెడ్డి, సహాయ డైరెక్టర్, జగిత్యాల జిల్లా**

సర్వేశాఖలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తేనే కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో ప్రజలకు ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. ఖాళీల భర్తీ, పోస్టుల మంజూరు చేపట్టడంతో పాటు జిల్లా, డివిజన్ కేంద్రాలతో పాటు, ప్రతి మండలానికి డీజీపీఎస్ మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. సర్వేశాఖలో సమస్యలను డైరెక్టర్ సర్వే సెటిల్‌మెంట్, కమిషనర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సానుకూల చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నాం.

**భూవివాదాలకు చెక్**

ప్రైవేటు సర్వేయర్లపై ఆధారపడితే ప్రభుత్వ భూముల విషయంలో అవకతవకలకు అవకాశం ఉండగా రైతులకు సైతం ఇబ్బందులు తప్పవని సర్వేవర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 29,21,527 ఎకరాల భూమి ఉండగా 2021లో ఉమ్మడి జిల్లాలో 1.12,517 మంది సాదా బైనామాకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే కోసం ఒక మండలంలో సగటున నెలకు 140 వరకు దరఖాస్తులు వస్తుండగా వీటిలో కేవలం 20 మాత్రమే పరిష్కరించడం సాధ్యమని బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఆర్గనేషన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ 2014లో అందించిన సవివర నివేదికలో స్పష్టంగా పేర్కొనడం, సర్వేశాఖను పూర్తిస్థాయిలో సన్నద్ధత చేయాల్సిన అవసరాన్ని తెలియచేస్తోంది. కాగా రద్దయిన పాత రెవెన్యూ చట్టం స్థానంలో త్వరలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం రానుండగా భవిష్యత్తులో భూవివాదాలకు అవకాశం లేకుండా, కొత్త చట్టంలో రీసర్వే నిబంధన అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీతో పాటు, అధునాతన పరికరాలు కేటాయించి, సర్వేశాఖను పూర్తిస్థాయి సామర్థ్యంతో సేవలు అందించే విధంగా సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

# పర్యవేక్షణ లోపం.. సంస్థలకు శాపం

కరీంనగర్ : ద్వితీయశ్రేణి నగరాల్లోనూ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కరీంనగర్ లో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ కూడా ఐటీ రంగానికి పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ప్రభుత్వాల నిర్ణయాలు మంచివే అయినా.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం ఐటీ సంస్థలకు శాపంగా మారింది. కరీంనగర్‌లోని ఐటీ టవర్‌లో సమస్యలపై కథనం.

కరీంనగర్‌లో ఉజ్వలపార్క్ సమీపంలో అయిదు అంతస్తులతో ఐటీ టవర్‌ను 2020లో అందుబాటులోకి తెచ్చారు. మూడు షిఫ్టుల్లో 2400 మందికి ఉద్యోగాలు కల్పించాలని మొదట నిర్ణయించినా.. పూర్తి స్థాయిలో కంపెనీలు రాలేదు. ప్రస్తుతం 11 సంస్థల కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటిలో వంద మందికిపైగా ఉద్యోగులున్నారు.

ఈ భవనంలో రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారు. రెండు రోజుల కిందట ఆ రెండూ పని చేయకపోవడంతో మెట్లెక్కి వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం ఒకటి మాత్రమే పని చేస్తోంది.

భవనంలో ఎలుకల బెడద ఉందని ఓ కంపెనీ నిర్వాహకుడు సాయి తెలిపారు. ఈ విషయాన్ని టీఎస్‌ఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఎలుకలతో దస్త్రాలు, ల్యాప్‌టాప్‌లకు నష్టం వాటిల్లితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు.

ఏసీ పని చేయడంలేదని నెల రోజులుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని, తాము వాడుతున్నవి ఖరీదైన ల్యాప్‌టాప్‌లని, అవి పాడయ్యే అవకాశముందని కంపెనీ నిర్వాహకుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే జనరేటర్ ఉన్నా వాడటంలేదు. కొన్ని సంస్థలు ఒప్పందం చేసుకున్న కుర్చీల కంటే అధికంగా వాడుతున్నాయనే ఆరోపణలున్నాయి.



ఆ భవనం నిర్వహణకు మొదట్లో 20 మంది ఉండేవారు. ప్రస్తుతం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు భద్రతా సిబ్బంది, ఒకరు సూపర్‌వైజర్, ఒకరు స్కావెంజర్, ఇద్దరు హౌస్‌కీపింగ్ ఉన్నారు. గతంలో కార్యాలయాలన్నీ శుభ్రం చేసేవారు. ప్రస్తుతం ఆ విధానాన్ని తొలగించి కేవలం సంస్థల బయట మాత్రమే చేస్తున్నారు.

ఐటీ టవర్‌లో పూర్తి స్థాయి కంపెనీలు రాకపోవడంతో నిర్వహణ భారం తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్‌ఐఐసీ)పై పడుతోంది. కొన్ని కంపెనీలు అద్దె చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. ఇది కూడా ఇబ్బందిగా మారిందని అంటున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తున్నాం**

లిఫ్టులు బాగు చేయిస్తున్నాం. ఏసీల విషయంలో కూడా అవసరమైన చర్యలు తీసుకుంటాం. జనరేటర్ అనేది విద్యుత్తు సరఫరా లేనప్పుడు మాత్రమే ఉపయోగిస్తాం. ఇప్పటికైతే ఆ అవసరం రాలేదు. కొన్ని కంపెనీలు ఒప్పందం కంటే అదనంగా సీట్లు ఉపయోగించడంపై విచారణ చేస్తాం.పద్మజ, జోనల్ మేనేజర్, టీఎస్‌ఐఐసీ

# ముఖ్యమంత్రి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి...


శామీర్ పేట, (గరుడ వార్త) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నివాసంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే శామీర్ పేట వరకు మెట్రో






రైల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి, శామీర్ పేట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు జన్మదిన పురస్కరించుకొని అనాధలకు అన్నదానం





శామీర్ పేట, (గరుడ వార్త) : ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు జన్మదిన పురస్కరించుకొని అనాధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు జన్మదినం సందర్భంగా మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామ పరిధిలోని అనాధ ఆశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తాళ్ల జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో అనాధలకు శనివారం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మన్మచారి, తాడెం స్వామి, సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



శామీర్ పేట, (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించారు. మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామ పరిధిలోని బీరప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు సామూహికంగా పడిపూజను సిద్దేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆ ప్రాంతం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారు మోగింది. ఈ ఈ పూజలో తాళ్ల జగదీష్ గౌడ్ గురు స్వామి, శ్రీకాంత్ గురు స్వామి, జగన్ కూడా అయ్యప్ప మాలధారణ స్వాములు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పన్నెండు నెలలు .. ఎన్నెన్నో కలలు

మిర్యాలగూడ : హాయ్.. హాలో.. వచ్చేశా..!.. నన్ను (2025 సంవత్సరం) సంతోషంగా స్వాగతించినందుకు మీకు ధన్యవాదాలు.. అర్ధరాత్రి వరకు నా ముందు సంవత్సరం (2024)తో చాలా సేపు కాలక్షేపం చేశారు కదా. మీ వేడుకలను కాస్త దగ్గర నుంచే నేనూ చూశాలెండీ! అవును.. పొద్దున్నే దైవ దర్శనం చేసుకున్నారా..? ఏమని ప్రార్థించారు మరి!? రాబోయే రోజులన్నీ మంచివే. మనవే. అన్ని వర్గాలకు కలిసొచ్చేటట్టే చేస్తా. నేను ఉండే ఈ పన్నెండు నెలల్లో ఎవరెవరి బాధ్యతలేంటో చెబుతా. ఏమి చేయాలో.. ఏమి చేయొద్దో వివరిస్తా.తప్పకుండా పాటించండి. అంతే.. మీ 2025 సంవత్సరం.

**ఆకాశమే హద్దుగా..**

ఆశలు రేకెత్తిస్తున్న సంతోషకర సందర్భంలోనే ఊహలకు రెక్కలు కడదాం. కొంగొత్త ప్రపంచంలోకి ఎగురుదాం. విద్యలో రాణిద్దాం. ఉద్యోగావకాశాలను ఒడిసి పడదాం. ఆరోగ్యం పైన దృష్టి సారిస్తేనే ఇది సాధ్యం. కర్షక లోకం వ్యవసాయంలో కొత్త పోకడలకు నాంది పలకాలి. మహిళలు ఆర్థిక వనరులకు సృష్టికర్తలుగా మారాలి. యువత సాంకేతికత అరచేతిలో పట్టుకుని విద్యనభ్యసించాలి. ఉద్యోగాలు పొందాలి. చిన్నారులకు మెరుగైన జీవన ప్రమాణాలతో ప్రాథమిక విద్యనందించాలి. ఉద్యోగ, వ్యాపార వర్గాల్లో కలిమి, చెలిమిని విస్తృతం చేస్తూ..ఇంటింటికి శుభవార్తల్నే మోసుకెళదాం. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలతో అందరూ సుఖ సంతోషాలతో ఈ ఏడాదంతా వర్ధిల్లాలని కాంక్షిద్దాం.

**అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాలి..**

ఈ ఏడాది సంక్షేమ పరుగులు పెట్టాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డుల మంజూరుతో పాటు..కార్డుల్లో పేర్లు చేర్చే ప్రక్రియ ఈ ఏడాది ప్రారంభించాలి. దీంతో పాటు రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం మాత్రమే కాకుండా ఇతర నిత్యావసర సరకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆసరా పింఛన్ల పెంపు, ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులు, రహదారులతో పాటు అద్దె భవనాల్లో సాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, వసతిగృహాలకు సొంత భవనాల నిర్మాణం, పేద వారి సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి. యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం వెలుగులు విరజిమ్మాలి.

**రైతన్నలూ..సేంద్రియ బాట పట్టాలి..**

ఉమ్మడి జిల్లా వ్యవసాయానికి పెట్టింది పేరు. ముఖ్యంగా ధాన్యం సాగులో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్న ఉమ్మడి జిల్లా రైతులు ఈ ఏడాది సైతం ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలి. ఈ ఏడాది వ్యవసాయం కొంత మార్పులు చేసుకుంటే మేలు. సాంకేతికంగా అభివృద్ధి సాధించడంతో పాటు..పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి. ప్రభుత్వాలు సైతం ఈ ఏడాది రైతులు ఆశించే రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలు సక్రమంగా అమలు చేసి వారి కళ్లల్లో ఆనందాలు నింపాలి.

**యువతా.. సమాజ సేవకు కదులు..**

ఇటీవల కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మద్యం, గంజాయి వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండేలా యువతకు విప్పు కలగాలి. కేవలం చదువు, ఉద్యోగం, ఉపాధి మార్గాలతో పాటు సమాజ సేవలో ఈ ఏడాది తమ వంతు పాత్ర పోషించాలి. యువత ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు సైతం తగిన ప్రోత్సాహం అందించాలి. పదుల సంఖ్యలో యువత రక్తదానాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. దీనిని ఈ ఏడాదిలో రెట్టింపు చేద్దాం.

**చిన్నారులూ.. జర భద్రం..**

జీవితంలో భాగమై..వ్యసనంలా మారిన చరవాణిని ఈ ఏడాదిలో చిన్నారులకు దూరం చేసే ప్రయత్నం చేద్దాం. పిల్లలకు చిన్నతనం నుంచే సంస్కృతీ, సంప్రదాయాలు, క్రీడలు, మాతృభాష, పెద్దల పట్ల గౌరవం పెంపొందించే పనులతో పాటు..పుస్తక పఠనం, రాయడం, పర్యావరణం పట్ల మక్కువ పెరిగేలా చైతన్య పరుద్దాం. ప్రాథమిక విద్యలో తెలుగుకు ప్రాధాన్యం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్యతో పాటు సమీకృత గురుకులాలు సైతం ప్రారంభం కానున్నాయి.


**మహిళలూ.. ఆర్థిక స్వావలంబన సాధించాలి..**

ప్రస్తుతం ప్రభుత్వాలు చేపడుతున్న పలు పథకాలతో మహిళలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ ఏడాదిలో వారికి మరింత ప్రోత్సాహం, ఆర్థిక సహకారం అందించి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను వడ్డీలకు తిప్పకుండా. సృజనాత్మకతతో జీవనోపాధి పనులపై పెట్టడం. కుటుంబ బడ్జెట్‌ను సొంత చేతిలోకి తీసుకోవాలి. ఆర్థిక వనరుల సృష్టికర్తలుగా, పారిశ్రామికవేత్తలుగా మారడం ఉత్తమం.

**కావాలి ఉద్యోగం, ఉపాధి**

తమ అభ్యున్నతికి రానున్న కొత్త ఏడాదిలో ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించాలని యువత తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. కొత్త ఏడాది నేపథ్యంలో యువత ఆశలు, ఆశయాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందితో నిర్వహించిన సర్వేలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిలో సరికొత్త నిర్ణయాలపై అడిగిన ప్రశ్నకు.. చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, ఆరోగ్య జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణ అంశాలకు ఇంచుమించు సమానంగా ఓటేశారు.

## సాగులో వృద్ధి.. రైతుల అభివృద్ధి



చేగుంట : కాలం కలిసి వస్తే రైతుల పంట పండుతుంది. వర్షాలతో పాటు అన్ని విధాలుగా వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. 2024లో మంచి పంటలు పండి సాగులో వృద్ధి చెంది కర్షకులు అభివృద్ధి చెందారు. జిల్లాలో ఎక్కువ శాతం రైతులు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు వివిధ రకాల పంటలు, కూరగాయలను సాగు చేస్తూ ఎంతో మంది కడుపు నింపుతున్నారు. అలాగే వారు కూడా అభివృద్ధి సాధిస్తున్నారు. 2024లో రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించింది. ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో సన్నాల సాగు చేపట్టి ప్రభుత్వం నుంచి బోనస్ అందుకున్నారు. ఇక కూరగాయలు కూడా పండిస్తూ ముందుకు సాగారు. మెదక్, చేగుంట, పాపన్నపేట, రామాయంపేట, మాసాయిపేట, నార్సింగి, వెల్దుర్తి, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, నర్సాపూర్, శివ్వంపేట, చిన్నశంకరంపేట, కొల్చారం, నిజాంపేట, కౌడిపల్లి తదితర మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు పండించి శభాష్ అనిపించారు.

# రైల్వే స్టేషన్‌కు మహర్దశ



పెద్దపల్లి : కొత్త సంవత్సరంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఇన్నాళ్లూ సాధారణ జంక్షన్ కొనసాగుతుండగా ఈ ఏడాదిలో రాష్ట్రంలో ప్రధానమైన జంక్షన్‌గా మార్చేందుకు రైల్వే శాఖ సమాయత్తమవుతోంది. త్వరలోనే కాజీపేటలో డివిజన్ కేంద్రం ఏర్పాటు కానుండగా పెద్దపల్లి స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. స్టేషన్‌లోని సరకు రవాణా ప్లాట్‌ఫాంను రైల్వే శాఖ ప్యాసింజర్ బోగీల అవసరాలకు వినియోగించుకునే యత్నాలు జరుగుతున్నాయి. అమృత్‌భారత్ స్టేషన్ నమూనాను పూర్తిగా మార్చేందుకు పనులు నిలిపివేసిన అధికారులు సింగరేణి బొగ్గు గనులు స్ఫురించేలా నమూనాను రూపొందిస్తున్నారు.

**రూ.26 కోట్లతో ఆధునికీకరణ పనులు**

ప్రయాణికుల రవాణాతో వచ్చే ఆదాయం పెరగడంతో ఎన్ఎస్‌జీ(నాన్ సబర్బన్ (గ్రేడ్)-4 స్థాయికి ఎదిగిన పెద్దపల్లి స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు కేంద్రం అమృత్‌భారత్ స్టేషన్‌గా ఎంపిక చేసి, రూ.26 కోట్లు మంజూరు చేసింది. తాజాగా స్టేషన్ డిజైన్‌ను మార్చడంతో నిర్మాణ వ్యయం పెరగనుంది.

ప్లాట్‌ఫాంలపై పూర్తిగా కవరింగ్ షెడ్ల నిర్మాణం, నాలుగో ప్లాట్‌ఫాం విస్తరణ, కాలినడకన వంతెనకు అదనంగా రెండు లిఫ్టులు, ఎస్కలేటర్ల నిర్మాణం చేపడతారు. అన్ని ప్లాట్‌ఫాంపై ఇరువైపులా శౌచాలయాలు(మరుగుదొడ్లు) నిర్మిస్తారు. ఒకటో ప్లాట్‌ఫాంపై ప్రస్తుతమున్న మొదటి, జనరల్ తరగతి వెయిటింగ్ హాల్‌ను విస్తరించి, అదనంగా ఏసీ వెయిటింగ్ హాల్ నిర్మిస్తారు.

ప్రస్తుతమున్న ఆటో టికెట్ ట్రెల్లింగ్ మిషన్‌కు అదనంగా మరోటి ఏర్పాటు చేయనున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఆధునికీకరించడంతో పాటు ప్రస్తుతమున్న హాల్‌ను విస్తరిస్తారు. స్టేషన్ ముందు భాగం డిజైన్ మార్చినప్పటికీ స్టేషన్ లోపలి వైపు పనులు మొదలయ్యాయి. కరీంనగర్ వైపు బైపాస్ రైలు మార్గం నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. వరంగల్, కాజీపేటల నుంచి కరీంనగర్ వైపు వెళ్లే రైళ్లకు హాల్టింగ్ కల్పించేందుకు బైపాస్ మార్గంలోనే స్టేషన్ నిర్మాణం పనులు మొదయ్యాయి.

ఇక ప్రస్తుత సరకుల రవాణా ప్లాట్‌ఫాంను దూర ప్రాంతం నుంచి వచ్చే రైలు బోగీలను శుభ్రం చేసేందుకు క్లీనింగ్ షెడ్డుగా మార్చాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ముంబాయి నుంచి వచ్చే రైలు బోగీలను కాజీపేట వరకు నడిపించి, అక్కడే శుభ్రం చేయాలా! పెద్దపల్లిలోనే క్లీనింగ్ షెడ్డు ఏర్పాటు చేయాలా? అనే అంశంపై అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ఏడాదిలోనే షెడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

**డ్రైపోర్టు దిశగా అడుగులు**

సుల్తానాబాద్ ప్రాంతంలో భూతల ఓడరేవు నిర్మాణానికి కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2008లో సర్వే చేసి నివేదికను కేంద్రానికి అందజేసింది. అనంతరం మారిన రాజకీయ పరిస్థితులు, రాష్ట్రావిర్భావంతో ప్రతిపాదన మరుగున పడింది. పారిశ్రామిక ప్రాంతాలైన రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లికి చేరువగా ఉండటం, ఇక్కడే పలు భారీ పరిశ్రమలున్నందున స్థానికంగా డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే ఉమ్మడి కరీంనగర్ పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్‌లోని సనత్‌నగర్, నాగులపల్లిల్లో డ్రైపోర్టు టెర్మినల్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో సుల్తానాబాద్ రైల్వే స్టేషన్‌లోని సరకు రవాణా షెడ్‌ను మరింత అభివృద్ధి చేసి, పెద్దపల్లిలోని షెడ్‌ను పూర్తిగా తరలించే ప్రక్రియపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆహారశుద్ధి తదితర పరిశ్రమల ఏర్పాటు అవకాశాలను మెరుగుపరిచేందుకు డ్రైపోర్టు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఉత్తర తెలంగాణకు ప్రధాన రవాణా హబ్‌గా ఎదిగేందుకు డ్రైపోర్టు దోహదపడుతుంది.

# పేదల్లో చిగురిస్తున్న ఆశలు



నర్సాపూర్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కొన్నేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పనులు చేసిన గుత్తేదార్లకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో అసంపూర్తిగా నిలిపివేశారు. ఎట్టకేలకు ఇటీవల కొంత మొత్తం చెల్లింపులు చేయడంతో పనులు పునఃప్రారంభం అవుతాయని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. నిర్దేశించిన కాల పరిమితిలో పూర్తి కావాల్సిన ఇళ్ల నిర్మాణాలు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని కొసరు పనులతో, మరికొన్ని స్లాబులు, గోడల పనులతో అసంపూర్తిగా ఉంటున్నాయి. **రూ.1.02కోట్ల బిల్లుల కేటాయింపు** నర్సాపూర్‌లోని ఏఎంసీ వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న 248 ఇళ్ల పనులు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు గడువులు విధిస్తూ వస్తున్నారు. గడువు దాటిపోతున్నా నేటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. పనులు అడపాదడపా సాగుతున్నాయి. వీటిల్లో 140 ఇళ్లు స్లాబులు పూర్తయ్యాయి. 64 ఇళ్లల్లో ఇటుక గోడలు పూర్తయ్యాయి. 38 ఇళ్లకు పిల్లర్లు వేశారు. కొన్ని గ్రౌండ్ ఫ్లోర్ స్లాబులతో సరిపెట్టారు. ఇలా వివిధ దశల్లో కొనసాగుతున్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు చేపట్టిన గుత్తేదారుకు ఇటీవల రూ.1.02కోట్ల బిల్లు మంజూరైందని పీఆర్ అధికారులు తెలిపారు. దీంతో ఈ పనులన్నీ పునఃప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వక...**

నర్సాపూర్‌లో రెండు చోట్ల ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ విపణికి ఎదురుగా 256 ఇళ్లు, వెనకాల మరో 248 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో ఏఎంసీ ముందు నిర్మించిన ఇళ్ల పనులు దాదాపు పూర్తికావచ్చాయి. కొసరు పనులతో దర్శనమిస్తున్నాయి. అయితే అధికారులు వీటికి బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. చిన్నపాటి పనులు పూర్తిచేస్తే పేదలకు ఇవి అందుబాటులోకి వస్తాయి. వీటిని కాదని ఏఎంసీ వెనక భాగంలో నిర్మించిన వాటికి బిల్లులు కేటాయించడం వివాదస్పదమవుతోంది. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలకు అద్దాలు అమర్చడం వంటి పనులు చేయాల్సి ఉంది. పనులు చేసిన గుత్తేదారుకు రూ.35లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీటిని చెల్లిస్తేనే మిగతా పనులు పూర్తి చేస్తానని గుత్తేదారు కొసరు పనులను నిలిపివేశారు. బిల్లుల చెల్లింపు పూర్తయితే తప్ప విద్యుదీకరణ, రంగులు వేయడం వంటి పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.


**పునఃప్రారంభానికి చర్యలు -భాస్కర్, ఏఈపీఆర్**

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పనులను పునఃప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఏఎంసీ వెనక భాగంలో ఇళ్లు నిర్మించిన గుత్తేదారుకు రూ.1.02కోట్ల బిల్లు మంజూరైంది. ఇందులో రూ.25లక్షల బిల్లును ఈఈ ఆపాలని నిర్ణయించారు. మధ్యలో ఆపేసిన పనులను పునఃప్రారంభిస్తేనే మిగతా బిల్లును ఇవ్వాలని నిర్ణయించాం. ఏఎంసీ ముందు భాగంలో చేపట్టిన ఇళ్లకు సంబంధించి బిల్లు విడుదలలో తీవ్ర జాప్యం వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# వినూత్న ఆవిష్కరణలు.. సరికొత్త ప్రమాణాలు

హైదరాబాద్: విద్య.. వైద్యంలో అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వినూత్న ఆవిష్కరణలు.. సరికొత్త ప్రమాణాలను సృష్టిస్తున్న ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధకులు.. విద్యార్థులకు 'కోహ్లీ ఛాలెంజ్ ప్రాజెక్ట్ (కేసీపీ)' చేయూత నందిస్తోంది. పరిశోధకులు, ఆచార్యులు, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్న లక్ష్యంతో టీసీఎస్ సంస్థ తొమ్మిదేళ్ల క్రితం ట్రిపుల్‌ఐటీలో కేసీపీని ఏర్పాటు చేసింది. వినూత్న ఆవిష్కరణలు.. విభిన్నమైన పరిశోధనలు చేసినవారికి బహుమతుల తోపాటు.. కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందేలా కృషి చేస్తోంది. ఈ ఏడాది అత్యుత్తమ అవిష్కరణలు.. పరిశోధనల వివరాలను కేసీపీ, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

**వేగంగా ఫలితం..** చిన్నపిల్లల్లో న్యూమోనియాను గుర్తించే పరికరాన్ని డాక్టర్ అభిషేక్ శ్రీవాత్సవ, డాక్టర్ అన్షు సార్జే కనుగొన్నారు. ఇతర పరికరాల్లో లేని సర్క్యూట్‌లు.. సెన్సర్లను అమర్చారు. అదనంగా ఊపిరితిత్తుల ఉచ్ఛ్వాస, నిశ్వాసలను విశ్లేషించే చిన్న యంత్రాన్ని అందులో ఉంచారు. ః పరికరాన్ని రోగుల చేతికి అమర్చితే చాలు.. అందులోని ప్రత్యేకమైన చిప్‌సాయంతో వేగంగా ఫలితాలను ఇస్తుందని డాక్టర్ అభిషేక్ శ్రీవాత్సవ వివరించారు. చిన్నారుల్లో న్యూమోనియాను గుర్తించేందుకు ప్రస్తుతం వేర్వేరు పరీక్షలు చేస్తున్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్నటు అనిపిస్తే అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తున్నారు. తమ పరికరం అందుబాటులోకి వస్తే చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.




**మరింత శక్తిమంతంగా డ్రోన్..**

ఇప్పటి వరకు డ్రోన్లంటే పక్షి రెక్క ఆకారంలో రూపొందుతున్నాయి. వాటి ఆకారాన్ని మార్చడంతోపాటు మరింత ఉపయుక్తంగా ఉండేలా గబ్బిలం రెక్క తరహాలో తయారు చేయాలని డాక్టర్ అఫ్తాబ్ హుస్సేన్ సంకల్పించారు.ట్రిపుల్ ఐటీలోని ప్రయోగశాలలో 18 నెలలు పరిశోధించి గబ్బిలం రెక్క తరహా డ్రోన్‌ను రూపొందించారు. ఇందులో కృత్రిమ గుండె ఆకారం తరహాలో ఒక పంప్ అమర్చారు.

ప్రస్తుతం వినియోగిస్తున్న డ్రోన్ల సామర్థ్యం కంటే నాలుగైదు రెట్లు శక్తివంతంగా ఉంటుంది. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను ప్రోత్సహించేందు కేసీపీ నిరంతరం పనిచేస్తోందని ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ మాధవ కృష్ణ తెలిపారు.

# ఆ నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయొచ్చు: హైడ్రా

హైదరాబాద్: చట్టాలను పాటిస్తూ, న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే నగరంలోని నీటి వనరులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలను తొలగిస్తున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఖాజాగూడలో హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను రంగనాథ్ వెల్లడించారు. భగీరథమ్మ చెరువు, తౌతోనికుంటలో ఆక్రమణల తొలగింపునకు జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 405 ప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్న రంగనాథ్.. ఇటీవల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా కూడా మానవత్వంతో భగీరథమ్మ చెరువు, తౌతోనికుంటలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను ఆక్రమించిన వారికి గత వారమే నోటీసులు ఇచ్చామని, హైడ్రా కార్యాలయానికి పిలిచి గూగుల్ ఎర్త్ మ్యాప్‌ల ఆధారంగా ఆక్రమణల విషయంపై స్పష్టంగా వివరించి 3..4 రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించినట్టు వివరించారు. అయినా, ఖాళీ చేయకపోవడంతో డిసెంబరు 30న మరోసారి నోటీసులు ఇచ్చి డిసెంబరు 31న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించినట్టు రంగనాథ్ వెల్లడించారు. ఈ ఆక్రమణలకు సంబంధించి కొంత మంది హైడ్రాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని రంగనాథ్ తీవ్రంగా ఖండించారు. భగీరథమ్మ, తౌతోనికుంటలోకి వెళ్లాల్సిన వరద నీరు ఆక్రమణల వల్ల తమ నివాసాల్లోకి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడి ఓ కార్పొరేట్ సంస్థ యజమానితోపాటు శిఖం పట్టాదారులను కూడా హైడ్రా కార్యాలయానికి పిలిచి సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఆక్రమణల విషయాన్ని సమగ్రంగా వివరించాకే నోటీసులు జారీ చేసినట్లు రంగనాథ్ తెలిపారు.



**హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం..**

హైదరాబాద్ ఖాజాగూడలోని బ్రహ్మనికుంట ప్రాంతంలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు జారీ చేసి 24 గంటలు గడవకముందే కూల్చివేతలు చేపట్టడమేమిటని నిలదీసింది. దీనిపై గతంలో హైడ్రా కమిషనర్‌కు స్పష్టంగా చెప్పినా మళ్లీ అదే కొనసాగిస్తున్నారని, ఇలాగైతే మరోసారి కోర్టుకు పిలిపించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఖాజాగూడలో చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతమంటూ నిర్మాణాలను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ మేకల అంజయ్య తదితరులు మంగళవారం అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారించాలంటూ (లంచ్ మోషన్) పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నం.18/ఇలో 12640 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారన్నారు.

హైడ్రా తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైడ్రా అధికారులు అక్కడ విచారించిన తరువాతే చర్యలు చేపట్టారన్నారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అనుమతుల్లేకుండా పిటిషనర్లు నిర్మాణాలు చేపట్టారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చామని న్యాయవాది చెప్పగా.. 24 గంటలే సమయం ఇస్తారా అంటూ న్యాయమూర్తి నిలదీశారు. కనీసం బాధితుల వివరణ తీసుకోకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని అన్నారు. ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారా అని ప్రశ్నించారు. తాజాగా నోటీసులు జారీ చేసి పిటిషనర్ల వివరణ తీసుకున్నాక.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా పిటిషనర్లు ప్రహరీ సహా ఏవైనా నిర్మాణాలు చేపట్టినట్లయితే వాటిని జీహెచ్ఎంసీ కూల్చివేయవచ్చని పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు.

# సైబర్ నేరాలపై సాంకేతిక అస్త్రం

హైదరాబాద్: ముల్లును ముల్లుతోనే తీయాలన్నది నానుడి. సాంకేతికతను ఆధారంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.వేల కోట్లు కొట్టేస్తున్నారు. ఇతరుల పేరుతో(మ్యూల్) సిమ్‌కార్డులు తీసుకుని సందేశాలు పంపిస్తూ, కాల్స్ చేసి భయపెడుతూ ఖాతాలో డబ్బంతా ఖాళీ చేస్తారు. ఈ నకిలీ వెబ్‌సైట్లు, యూఆర్ఎల్‌ల భరతం పట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) సాంకేతిక అస్త్రం ప్రయోగిస్తోంది. నేరగాళ్లను మాత్రమే అరెస్టు చేయకుండా.. వారు ఉపయోగించే వెబ్‌సైట్లు, సిమ్‌లు, ఫోన్లు పనిచేయకుండా నిర్వీర్యం చేస్తోంది. ఈ ఏడాది దాదాపు 25వేల సిమ్‌లు, ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేసింది. 1825 నకిలీ వెబ్‌సైట్లను నిర్వీర్యం చేసింది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని రెండు విభాగాలతో ఇది సాధ్యమవుతోంది.

**డేటా అగ్రిగేషన్ అనాలసిస్ యూనిట్**

సైబర్ నేరగాళ్లు ఉపయోగించే ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు, ఈమెయిల్ ఐడీ, వెబ్‌సైట్లు, యాప్‌లు తదితరాలపై డేటా అగ్రిగేషన్ అనాలసిస్ యూనిట్ దృష్టి సారిస్తుంది. నేరం జరిగినప్పుడు లభించే సాంకేతిక ఆధారాలతో గూగుల్, ఇతర సామాజిక మాధ్యమ సంస్థలు, టెలికాం ఆపరేటర్లను సంప్రదించి ఈ నకిలీ డేటా మూలాలు సేకరిస్తారు. ఇప్పటివరకు దాదాపు 50 వేలకుపైగా యూఆర్ఎల్, 40 వేలకుపైగా సిమ్‌కార్డులనును విశ్లేషించినట్లు అధికారులు తెలిపారు.

**థ్రెట్ ఇంటలిజెన్స్ యూనిట్**ఎప్పటికప్పుడు కొత్తగా జరిగే సైబర్ నేరాల తీరును గమనిస్తూ అప్రమత్తం చేయడం, నిందితులు వాడే వెబ్‌సైట్లు, యాప్, సామాజిక మాధ్యమ ఖాతాలు పనిచేయకుండా నిర్వీర్యం చేయడం ఈ విభాగం పని. ఉదాహరణకు కారు షోరూం డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ నేరగాళ్లు నకిలీ సామాజిక మాధ్యమ ఖాతానుంచి వెబ్‌సైట్ లింకు పంపి డబ్బు వసూలు చేస్తుంటారు. ఈ సమాచారం ఆధారంగా థ్రెట్ ఇంటెలిజెన్స్ విభాగం నకిలీ సామాజిక మాధ్యమ ఖాతా, వెబ్‌సైట్‌ను గుర్తించి.. వాటిని తొలగించాలని సంబంధిత సంస్థలకు లేఖ రాస్తుంది. కొత్తగా అందుబాటులోకి వచ్చే అనుమానాస్పద యాప్‌లు, వాటితో చేసే మోసాలనూ గమనిస్తుంటుంది.

# నిధుల వేటలో హెచ్ఎండీఏ

హైదరాబాద్ : కొత్త ఏడాదిలో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులను పరుగులు పెట్టించాలని భావిస్తున్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) నిధుల వేట కొనసాగిస్తోంది. ఇప్పటికే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కొన్నింటికి భూసేకరణకు కూడా అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు నిధుల కోసం పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ విదేశీ బ్యాంకులతో పాటు దేశీయంగా హడ్కో, ఇతర ఫైనాన్స్ సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

జిల్లాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సజావుగా రాకపోకలు సాగించేందుకు ప్యారడైజ్ జంక్షన్ నుంచి రెండు హెలివేటెడ్ కారిడార్లను నిర్మించేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల కిందట శంకుస్థాపన చేశారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి రక్షణ శాఖ భూములు కీలకంగా మారాయి. అనేక సార్లు దిల్లీ వెళ్లి ఈ భూములను సేకరించేందుకు రక్షణ శాఖను ఒప్పించారు. ఇందులో భాగంగా ఇప్పటికే భూములను అప్పగించేందుకు రక్షణ శాఖ సైతం ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ నడుస్తోంది. జనవరిలో రక్షణ భూములు హెచ్ఎండీఏ చేతికి రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు భూసేకరణతో కలిపి రూ. 5 వేల కోట్లపైనే అవసరం. వీటితోపాటు మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా మీరాలం చెరువుపై ఆరు లైన్లతో ఐకాన్ వంతెన, దానిని చుట్టూ పరిసరాల్లో పచ్చదనం, మౌలిక వసతుల




అభివృద్ధికి రూ. 250 కోట్లు అవసరం ఉంది. ఈ వంతెనతో పాతబస్తీ రూపురేఖలు మారనున్నాయి. త్వరలో నిర్మాణ పనులు మొదలు కానున్న ఆర్ఆర్ఆర్ నగరంతో అన్ని జిల్లాలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఫోర్త్‌సిటీ నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు ఈ కొత్తనగరంతో కలిపేందుకు 100 మీటర్ల వెడల్పుతో 41 కిలోమీటర్ల మేరకు గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణానికి హెచ్ఎండీఏ సమాయత్తమవుతోంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి పలు సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. కొత్త ఏడాదిలో నిధుల సమీకరణ ఒక కొలిక్కి వచ్చి అన్ని ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయని భావిస్తున్నారు. మార్చి నుంచి అన్ని ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుందని చెబుతున్నారు. అవసరమయ్యే నిధులు ఇలా (భూసేకరణతో కలిపి రూ.కోట్లల్లోనే)ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఓఆర్ఆర్ శామీర్‌పేట జంక్షన్ వరకు హెలివేటెడ్ కారిడార్ – రూ. 3,619


ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్–44 డెయిరీఫాం వరకు హెలివేటెడ్ కారిడార్ – రూ. 1,844 మీరాలం ట్యాంకుపై 6 లేన్ల ఐకాన్ వంతెన నిర్మాణం – రూ. 250 కోట్లుమీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు – రూ. 2,710

ఓఆర్ఆర్ రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు – రూ. 2,112

# ఇంటర్ విద్య... మరింత మెరుగ్గా..!

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు (1969) నుంచి పౌరశాస్త్రం (సివిక్స్) సబ్జెక్టును బోధించేందుకు శాశ్వాత అధ్యాపకులను నియమించలేదు. హిస్టరీ (చరిత్ర) బోధిస్తున్న అధ్యాపకులకే ఈ బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక కళాశాలల్లో నెలకొంది. బోధన సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నిసార్లు సర్కారు దృష్టికి తీసుకెళ్లినా నిరాశే ఎదురైంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉభయ జిల్లాల్లో అధ్యాపకుల కొరత తీరటంతో పాటు విద్యార్థులకు బోధన మెరుగుపడనుంది.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంటర్ ఉచిత విద్యనందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరింత బలోపేతం కానున్నాయి. కొన్నేళ్లుగా శాశ్వత అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవటంతో కళాశాలల్లో బోధనపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావటం లేదు. ఈ సమస్య పరిష్కారం దిశగా



ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారి సర్కారు కళాశాలల్లో 1,239 మంది అధ్యాపకులు విధుల్లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియను ఫిబ్రవరిలోపే పూర్తిచేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఖమ్మం జిల్లాలోని 21, భద్రాద్రి జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 110 శాశ్వత అధ్యాపకుల పోస్టులు భర్తీకానున్నాయి.

**చదువులపై తీవ్ర ప్రభావం**

అధ్యాపకుల కొరత వల్ల విద్యార్థుల చదువులతో పాటు సమాజంపైనా తీవ్రమైన ప్రభావం కనిపిస్తోంది. సరైన బోధన, అభ్యాసం లేకుండా విద్యార్థులు చదువుల్లో రాణించలేకపోతున్నారు. మార్గదర్శకత్వం లోపించటంతో గందరగోళానికి గురవుతున్నారు. తక్కువ మార్కుల కారణంగా భవిష్యత్తుపై నమ్మకం కోల్పోతున్నారు. అభద్రతాభావంతో కొందరు మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. తక్కువ విద్యా నైపుణ్యాలు ఉన్నత విద్యకు దారితీయవు. సమాజంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలు పెరుగుతున్నాయి.

**భవిష్యత్తును నిర్దేశించే దశ**

విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకమైంది. నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకునేది ఈ దశలోనే. ఇక్కడే విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించి స్పష్టమైన అవగాహనకు వస్తారు. ఇంటర్ విద్య ఉన్నత విద్యాకోర్సులకు(ఇంజినీరింగ్, వైద్యం, బిజినెస్ మేనేజ్‌మెంట్ తదితరాలు) బలమైన పునాది. ఆయా కోర్సులను అభ్యసించేందుకు, ప్రవేశాలు పొందేందుకు ఇంటర్ విద్య విషయ పరిజ్ఞానాన్ని అందిస్తుంది. నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు పునాది ఈ దశలోనే పడుతుంది.

# కేవీకే శిక్షణ.. ఉపాధి నిచ్చెన



జమ్మికుంట : మారుతున్న జీనవ శైలిలో భాగంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చాయి. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తున్నారు. చిరు ధాన్యాల ఆహారాన్ని తీసుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరు ధాన్యాలు, పండ్లు, కూరగాయలతో చేసుకునే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణ ఇస్తోంది. 15 నెలలుగా 120 మంది మహిళలు, యువతులకు ఇచ్చిన శిక్షణ మంచి ఫలితాలను ఇస్తోంది. చిరుధాన్యాల లడ్డూలు, రాగుల లడ్డూలు, జావ తయారీ, రాగులతో కేకులు, కొర్రలతో చాక్లెట్, అరిక అట్టు, జొన్న బిస్కెట్ల తయారీ, రాగులతో దోశ, మురుకుల తయారీ, వరిగల భర్ఫీ, రాగులు జొన్నలతో ఇడ్లీ, పండ్ల జామ్‌లు, మిల్క్ షేక్‌లు, మల్టీగ్రేయిన్ జావా, రాగుల పిండి, మొలకల గోధుమ, గానుగ నూనె తయారీ తదితరాలపై శిక్షణ ఇచ్చి స్వయంగా తయారు చేసుకునేలా కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి తర్ఫీదు ఇచ్చారు. దీంతో 39 మంది చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలతో ఆహార ఉత్పత్తులను తయారీ చేసి విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.

**హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో విక్రయం**

కేవీకేలో తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకున్నా. కేవీకే డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగే సదస్సుల సందర్భంగా హైదరాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. అక్కడికి వెళ్లి నేను తయారు చేస్తున్న ఉత్పత్తులను విక్రయిస్తున్నాను. గానుగ పద్ధతిలో నూనె తయారు చేసి విక్రయిస్తున్నా. రూ.పదిహేను వేలు మిగులుతున్నాయి. ఆకినపల్లి పద్మ, శాయంపేట, జమ్మికుంట

**అందరికీ ఆసక్తి**

నేను లడ్డూలు, బిస్కెట్లు, కేకులు, పండ్ల రసాలు తయారు చేసి విక్రయిస్తున్నా. మా కుమార్తె నిఖిల ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణలో భాగంగా ప్యాకింగ్, లేబుల్స్‌పై మెలకువలు నేర్చుకుంది. పోషక పదార్థాల ఆర్డర్‌ను బట్టి ఉత్పత్తులు తయారు చేస్తూ కరీంనగర్‌లో విక్రయిస్తున్నాం. ప్రస్తుతం చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాల వినియోగంపై అందరికీ ఆసక్తి పెరుగుతోంది.
శ్రీలత, శ్రీరాములపల్లి, ఇల్లందకుంట

**ఆర్డర్లను బట్టి తయారీ..**

నేను ఎంఏ బీఈడీ చేశాను. జమ్మికుంట కేవీకేలో పోషాకాహార పదార్థాలపై ఇచ్చిన శిక్షణ ఉపాధికి భరోసా ఇచ్చింది. చిరుధాన్యాలతో లడ్డూలు, ఇడ్లీ, దోశ, రొట్టెల తయారీ, బిస్కెట్లు, కేకుల తయారీ, పండ్ల నిల్వ రసాలు తయారు చేసి విక్రయిస్తున్నా. వేడుకలకు ఫోన్ ద్వారా వచ్చే ఆర్డర్లను బట్టి ఇంట్లోనే తయారు చేసి పంపిస్తా. నెలకు ఖర్చులు పోను రూ. 20 వేల వరకు వస్తున్నాయి. సౌజన్య, నర్సింగాపూర్, వీణవంక

**జిల్లా అధికారుల నుంచి లైసెన్స్‌లు**

కేవీకేలో ఇప్పటికే 120 మంది మహిళలు, యువతులకు శిక్షణ ఇచ్చాం. 39 మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. అధికారుల నుంచి కేంద్రంలో శిక్షణ పొందిన 13 మంది ఫుడ్ తయారీకి సంబంధించిన లైసెన్స్‌లు పొందారు. ఎ.ప్రశాంతి, శాస్త్రవేత్త, గృహవిజ్ఞాన విభాగం కృషి విజ్ఞాన కేంద్రం

# ఆధ్యాత్మిక క్షేత్రం.. తాగునీరు గగనం!




ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహస్వామి కొలువుదీరిన ధర్మపురి పట్టణం.. తాగునీటికి అల్లాడుతోంది. గోదావరి పక్కనే ఉన్నా.. తాగునీటికి మాత్రం ఏటా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇది వేసవిలో అనుకుంటే సాధారణమే అయినా.. శీతాకాలంలోనూ అదే పరిస్థితి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీరు జిల్లాలోని డబ్బా గ్రామం నుంచి ధర్మపురికి సరఫరా కావడం లేదు. మరోవైపు కమలాపూర్ బోలిచెరువు వద్దగల పైపులైను ఇటీవల పగిలిపోయింది. దీంతో మూడు రోజులుగా పట్టణంలో నీటి సమస్య వేధిస్తుంది. పురపాలక అధికారులు ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

**పైపులైను విస్తరణ ఇంకెప్పుడు?**

పట్టణంలోని కమలాపూర్, నక్కలపేట ఇందిరమ్మ కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైను విస్తరణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ రెండు కాలనీల్లో తాగు నీటి సమస్యలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో సుమారుగా రెండు వేలమంది నివసిస్తుండగా.. తాగునీటికి సమీపంలోని బోర్ల పైనే ఆధారపడుతున్నారు. తాగునీటి పైపులైన్ పనులు పూర్తి కావాల్సి ఉంది. వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**రైతుల ఖాతాలకు రుణమాఫీ నిధులు**

జగిత్యాల : రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితమే నాలుగో విడత పంట రుణమాఫీ ప్రక్రియను ప్రకటించగా రెండు రోజులుగా రైతుల పంటరుణ ఖాతాలకు నిధులను విడుదల చేస్తున్నారు. ఈ విడతలో జిల్లాలో 8,414 మంది ఉండగా వీరికి ప్రస్తుతం రూ. 76.47 కోట్ల నిధులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 తేదీల్లో తీసుకున్న పంటరుణాలు, రెన్యూవల్స్ రుణాలను పరిగణలోకి తీసుకుని పంటరుణాల మాఫీ ప్రక్రియ చేపట్టింది. ఈ కటాఫ్ తేదీ ప్రకారం జగిత్యాల జిల్లాలో మొత్తం 1,38,142 మంది రైతులుండగా నాలుగు విడతల్లో కలిపి ఇప్పటివరకు 80,515 మందికి రూ. 721.74 కోట్ల నిధులను విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ నాలుగు విడతల్లోనూ వివిధ కారణాలతో జిల్లాలో నిధులందని రైతులు 5 వేల మంది వరకు ఉన్నట్లు అధికారుల అంచనాగా ఉంది.

**పూర్తిస్థాయిలో చేయరూ..**

పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని రూ. 2 లక్షలకన్నా అధికంగా రుణమున్న అన్నదాతలు కోరుతున్నారు. జిల్లాలో రూ. 2 లక్షలకన్నా ఎక్కువ రుణమున్నవారు 53,627 మంది ఉన్నారు. వీరిలో వ్యక్తిగతంగా లేదా రేషన్‌కార్డును కుటుంబంగా లెక్కించి ఇప్పటివరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. కుటుంబాన్ని ఒక యూనిట్గా లెక్కించి ఎందరికి, ఎంత రుణమున్నా రూ. 2 లక్షలకన్నా అదనంగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రూ. 2 లక్షలను విడుదల చేస్తామని తొలుత ప్రభుత్వం ప్రకటించింది కానీ.. రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తయ్యిందని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం పేర్కొనటంతో అంతకుపైన ఉన్న తమ పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంలో ఒకరికి రూ. లక్షన్నర, మరొకరికి రూ. లక్ష.. ఇలా చాలా కుటుంబాల్లో వ్యక్తిగతంగా రూ. 2 లక్షలకన్నా తక్కువగానే రుణమున్నా కుటుంబాన్ని కలిపి లెక్కించటంతో రూ. 2 లక్షలను దాటింది. ఈ నేపథ్యంలో కనీసం ఒకరినయినా పరిగణలోకి తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

లబ్ధి పొందిన రైతుల సంఖ్య
మొదటి విడత : 49,050
రెండో దఫా : 15,466
మూడో విడత : 7,585
నాలుగో దఫా : 8,414

# జీజీ కళాశాల అభివృద్ధికి సహకరించండి



నిజామాబాద్ : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు, దాతలు ముందుకు రావాలని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పూర్వవిద్యార్థుల సంఘం సమన్వయకర్త దండుస్వామితో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. త్వరలో న్యాక్ గుర్తింపు కోసం సన్నద్ధమవుతున్నామని తెలిపారు. ఇందుకోసం కళాశాలలో మౌలిక వసతుల కల్పన, అంతర్గత రోడ్లు, విద్యుద్దీపాల ఏర్పాటు కోసం సహకరించాలన్నారు. ఇప్పటి వరకు 1975–78, 1981 తదితర బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు రెండు పార్కింగ్ షెడ్లు, వివిధ విభాగాల్లో ప్రతిభచాటే విద్యార్థులకు పది బంగారు పతకాలు ప్రదానం చేసేందుకు నిధులు సమకూర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వ్యక్తిగతంగా రూ. 1.50 లక్షలు, న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి చెరో రూ. 25 వేలు, విశ్రాంత అధ్యాపకులు, ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులు సైతం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఉపకులపతులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల రాష్ట్ర సారథులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు.

# ఇంకెన్నాళ్లు.. ఈ కష్టాలు?

ఖమ్మం : సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితులు పరిహారం కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో సుమారు 960 ఎకరాలు, ఖమ్మం జిల్లాలోని నాలుగు ప్యాకేజీల్లో రైతులకు పరిహారం అందని ద్రాక్షగానే మారింది. భూసేకరణ సమయంలో నిర్వాసితులందరికీ న్యాయమైన పరిహారమందిస్తామని ప్రకటించిన అధికారులు.. ఆతర్వాత అమాంతం తగ్గించి చెల్లిస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఖమ్మం జిల్లాలో పరిహారం లెక్కలు తేలటం లేదు.

**రైతుల నిరీక్షణ..**

ఉభయ జిల్లాల్లోని సుమారు 9లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రభుత్వం 2017లో సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అశ్వాపురం మండలం భీమునిగుండం కొత్తూరు వద్ద 2018లో పనులు మొదలయ్యాయి. 16 (భద్రాద్రి జిల్లాలో 1–12, ఖమ్మం జిల్లాలో 13–16) ప్యాకేజీలుగా పనులను విభజించారు. రెండేళ్లలో పనులు పూర్తవ్వాలని లక్ష్యం నిర్దేశించుకున్నా ఇప్పటికీ కొనసా..గుతూనే ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 6,322.17 ఎకరాల భూమిని సేకరించగా 5,363.14 ఎకరాలకు రూ. 381.82కోట్ల పరిహారం చెల్లించారు. 959.03 ఎకరాలకు రూ. 75.08కోట్ల పరిహారం నిర్వాసితులకు అందాల్సి ఉంది. అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

**పనులు సాగుతున్నా..**

ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తీసుకొచ్చే లక్ష్యంతో సత్తుపల్లి ట్రంక్, పాలేరు ట్రంక్, రాజీవ్ అనుసంధాన కాల్వ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గోదావరి జలాలతో వైరా జలాశయాన్ని నింపి తద్వారా



వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని 1.20లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేలా రాజీవ్ అనుసంధాన కాల్వకు రూపకల్పన చేసింది. రూ. 100కోట్లోతో 8.60కి.మీ. కాల్వ నిర్మించాలని నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు, భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు మండలాలకు చెందిన 300 మంది రైతుల నుంచి 193 ఎకరాలను అధికారులు సేకరించారు. పరిహారం ఖరారయ్యాక భూసేకరణ జరగటం ఆనవాయితీ. అయినా ఇక్కడ మాత్రం రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ముందే స్థలాలిచ్చారు. ఎకరాకు రూ. 40లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతుండగా రూ. 20లక్షలు చెల్లిస్తామని అధికారులు ఇటీవల ప్రకటించారు. దీనిని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సత్తుపల్లి ట్రంక్ పరిధిలో 1.27 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా 116 కి.మీ. పొడవు కాల్వ నిర్మాణం సాగుతోంది. పాలేరు ట్రంక్ పరిధిలో 94వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 79కి.మీ. పొడవు కాల్వపనులు జం

**అధికారులు ఏమంటున్నారంటే..**

నిర్వాసిత రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే వారి ఖాతాల్లో పరిహారం సొమ్ము జమవుతుందని చెబుతున్నారు.

స్రీతారామ పాజెక్టు అనుసంధాన కాల్వ నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చాం. దీనిలో అరెకరం ప్రభుత్వ భూమి ఉందని అధికారులు తెలిపారు. పట్టా భూమి ఎకరాకు రూ. 20లక్షల పరిహారమిస్తామని ఇటీవల ప్రకటించారు. ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న గిరిజనేతరులకు ఎకరాకు రూ. 5లక్షలే ఇస్తామని తెలిపారు. అన్నిరకాల భూములకు ఒకేరకంగా పరిహారం చెల్లించాలి.
నరసింహారావు, వినోబానగర్, జూలూరుపాడు మండలం

మాకు 3.01ఎకరాల భూమి ఉండగా 40ఏళ్లుగా పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాం. గతేడాది సీతారామ అనుసంధాన కాల్వ నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చాం. మిగిలిన ఎకరం మధ్యలో కాల్వ తవ్వారు. ఈ భూమిని సాగు చేసుకోవటం కష్టంగా మారింది. పరిహారం అంశంపై నెలకో సమావేశం నిర్వహిస్తున్నా ప్రయోజనం లేదు. న్యాయమైన పరిహారం అందించాలి.
భాస్కర్‌రావు, ఏన్కూరు

# ఆ వాహనాలు మాకూ కావాలి..

ఖమ్మం : గర్భిణులు, బాలింతలతోపాటు ఏడాదిలోపు చిన్నారులను ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వాసుపత్రులకు తీసుకెళ్లేందుకు 102 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో అమ్మఒడి పథకంలో భాగంగా 2018లో ఈ సేవలు మొదలయ్యాయి. ధర్మాసుపత్రులకు వెళ్లేందుకు పేద వర్గాలకు వ్యయప్రయాసలను దూరం చేసిన ఈ వాహన సదుపాయం అనతికాలంలోనే ఆదరణ చూరగొంది. ఖమ్మం జిల్లాలో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు అనుబంధంగా మొత్తం పదకొండు వాహనాలున్నాయి. క్షేత్ర స్థాయిలో అవగాహన పెరగడంతో గతేడాది 38,629 మంది 102 వాహనాలను వినియోగించుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నేటికీ ఈ సదుపాయం అందుబాటులో లేదు. కొత్త వసంతంలో అయినా అవసరాలకు తగ్గట్టు వాహనాల సంఖ్య పెంచాలని జిల్లావాసులు కోరుతున్నారు.

**ఇక్కడ ఎంతో అవసరం..**

ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ మంది సేవలు పొందుతున్నట్లు గుర్తించిన పెనుబల్లి, బోనకల్లు, ముదిగొండ ప్రాంతాల్లో 102 వాహనాలు లేవు. బోనకల్లుకు మధిర, వైరా ప్రాంతాల నుంచి, ముదిగొండకు నేలకొండపల్లి, ఖమ్మం నుంచి వాహనాలు వెళ్తున్నాయి. పెనుబల్లికి కల్లూరు, సత్తుపల్లి మండల వాహనాలే ఆధారమయ్యాయి. కొన్నిసార్లు వాహనాల రాకలో జాప్యం జరుగుతూ లబ్ధిదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యయప్రయాసలతో ప్రైవేటు వాహనాల్లో సర్వజనాసుపత్రికి వస్తున్నామని గర్భిణులు చెబుతున్నారు.

**కాల్ చేస్తే సరి..**గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడి నుంచైనా 102 నంబర్‌కు కాల్ చేస్తే పరిసరాల్లో ఉన్న అంబులెన్స్ సర్వీసు వస్తుంది. అవసరార్థులను ఆస్పత్రులకు తరలిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ప్రసవ కిట్లు కూడా ఇందులో ఉన్నాయి.

ఇక్కడ ఉన్నాయి..ఖమ్మం సర్వజనాసుపత్రి, సత్తుపల్లి, మధిర, కల్లూరు, నేలకొండపల్లి, వైరా సీహెచ్‌సీలు, కామేపల్లి, ఏన్కూరు, తిరుమలాయపాలెం, మంచుకొండ, కూసుమంచి పీహెచ్‌సీల్లో..

# కలిసికట్టుగా ఛార్జింగ్

హైదరాబాద్: విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచేందుకు టీజీ రెడ్కో (తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ), హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) కలిసికట్టుగా ముందుకెళ్తున్నాయి. పాదబాటలు, రహదారుల పక్కనున్న స్థలాలను జీహెచ్ఎంసీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేటాయిస్తుండగా, ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్ల ఛార్జింగ్‌కు అవసరమయ్యే ఏర్పాట్లను రెడ్కో పూర్తి చేస్తోంది. ఇప్పటికే 40 చోట్ల కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. మరో 43 ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు చివరి దశలో ఉంది. విద్యుత్తు శాఖ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఇతర అనుమతులు పూర్తవ్వాల్సి ఉందని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది. మొదటి దశలో మొత్తం 99 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెడ్కో, జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం 83 చోట్ల ఛార్జింగ్ యూనిట్ల ఏర్పాట్లు పూర్తవగా, 43 ఇప్పటికే మొదలయ్యాయి. మిగిలినవి వేర్వేరు దశల్లో ఉన్నాయి.



**నామమాత్రపు రుసుంతో..**
కొత్త ఛార్జింగ్ కేంద్రాలను ప్రజలు నామమాత్రపు రుసుంతో ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కారుకు అరగంటలో ఛార్జింగ్ పూర్తవుతుందని తెలిపారు. ‘టీఎస్ ఈవీ’ అనే యాప్‌ను రూపొందించామని, దీని సేవలు త్వరలో అందుబాటులోకి వస్తాయంటున్నారు.

**పనిచేస్తున్న కేంద్రాలు..** వైదేహినగర్ బస్టాపు, శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, అల్విన్‌కాలనీ ఎక్స్ రోడ్డు, డీఎల్ఎఫ్ భవనం ఎదురుగా, స్వామి వివేకానంద పార్కు (ఎన్బీటీ కాలనీ), సచివాలయం నగర్ కమ్యూనిటీ హాల్, డెలాయిట్ మీనాక్షి ఎదురుగా, నాగోల్ సర్వీసు రోడ్డుపై మెట్రో పిల్లరు సీ819 వద్ద, సచివాలయంనగర్ కమాన్ వద్ద, జడ్పీహెచ్ఎస్ స్కూలు వెనక, ఇంపీరియల్ హోటల్ ఎదురుగా, హబ్సిగూడ మెట్రో పిల్లరు సీ929 వద్ద, షెల్ పెట్రోలు పంపు పక్కన, వివేకవర్ధిని విద్యాసంస్థల వద్ద, చర్లపల్లి బస్టాపు పక్కన, జాన్సన్ గ్రామర్ స్కూల్ ఎదురుగా, విజయ గార్డెన్ కాలనీ పార్కు వద్ద తదితర ప్రాంతాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

# విప్రో పక్కన ఇల్లు కట్టేసుకుంటే పోలా!


హైదరాబాద్ : నగరంలో సర్కారు స్థలాలు ఖాళీగా ఉంటే చాలు.. అక్రమార్కులు గుడిసెలు.. ఇళ్లు కట్టేసుకుంటున్నారు. తప్పుడు పత్రాలు చూపించి ప్రహరీలు నిర్మిస్తున్నారు. తాజాగా ఐటీకారిడార్‌లోని విప్రో సంస్థ (%Wipro%) కార్యాలయం పక్కనే కొందరు గృహ నిర్మాణం చేపట్టారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి వంద నిర్మాణాలను కూల్చివేయించారు. అక్కడున్న వారిని ప్రశ్నించగా... ఇళ్లు కట్టండంటూ తమకు డబ్బులిచ్చారని, వారెవరో తెలీదని సమాధానమిచ్చారు. పనులు ఆపేసి వెళ్లండంటూ వారిని అధికారులు హెచ్చరించారు. నాలుగు ఎకరాల్లో పనులు మొదలు పెట్టి.. మరో పది ఎకరాలను నాగళ్లతో దున్ని చదును చేసినట్టు గుర్తించారు. రూ.1400 కోట్ల విలువైన భూములను ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

**హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయం తెలుసుకుని...**
వట్టినాగులపల్లి సర్వే నంబరు 132లోని 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో విప్రో సంస్థకు 70ఎకరాలను సర్కారు అప్పట్లో విక్రయించింది. మిగిలిన 50 ఎకరాలను ప్రస్తుత టీజీఐఐసీకి కేటాయించింది. టీజీఐఐసీ అధికారులు ఇటీవలే హౌసింగ్‌బోర్డుకు అప్పగించారు. సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు. దీన్ని గమనించిన కొందరు వేగంగా పావులు కదిపారు. వారం పదిరోజుల నుంచి రాత్రివేళ చదును చేయడం, పునాదులు తవ్వడం, గజాల చొప్పున ప్లాట్లను విభజించి ముగ్గులు పోయడం వంటివి చేశారు. ఇళ్లను వేగంగా నిర్మించి అందులో చేరేందుకు కార్యాచరణ రూపొందించారు.

**అక్రమార్కుల వెనుక ఎవరు?**
ఇళ్ల నిర్మాణాల వెనుక ఎవరున్నారనే అంశంపై రెవెన్యూ అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ఎవరన్నది తెలియకపోతే పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలని యోచిస్తున్నారు. భూములను ఆక్రమించి, పట్టాలుగా విక్రయించే ముఠా తెరవెనుక ఉందేమోనని అనుమానిస్తున్నారు. ప్లాట్లను ఇప్పటికే కొందరికి విక్రయించినట్టు తెలుసుకున్నారు. వారిని పిలిపించి ఏ పత్రాలు ఇచ్చారో పరిశీలించనున్నారు. మరోవైపు ఈ వ్యవహారం వెనుక మీడియా పేరు చెప్పుకొంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో దర్పం ప్రదర్శిస్తున్న కొందరు వ్యక్తులున్నట్లు తెలిసింది.

# ఫ్యాబ్ సిటీలో ఐటీ సంస్థలు.. పరిశ్రమలు

హైదరాబాద్ : తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, పరిశ్రమలశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫ్యాబ్ సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం డీ-నోటిఫై చేయడంతో ఆయా విభాగాల అధికారులు అందులో వాటిని ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఫ్యాబ్‌సిటీకి



15 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతున్న నేపథ్యంలో మధ్యలో మరిన్ని ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలతో అనుసంధానించేందుకు కార్యాచరణ రూపొందించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాబాద్ మండలాల్లో ఇప్పటికే బహుళజాతి సంస్థలు పరిశ్రమలను నెలకొల్పడంతో ఫ్యాబ్‌సిటీలో ఇలాంటి పరిశ్రమలకు అనువైన పరిస్థితులను కల్పిస్తున్నారు.

# ప్రకృతి పులకింత.. ప్రత్యేకతల కలబోత



హైదరాబాద్: అవుటర్ రింగ్‌రోడ్డు దరి..హిమాయత్‌సాగర్ చెంత సిద్ధం చేసిన కొత్వాల్‌గూడ ఎకో పార్కు సందర్శకుల కోసం సిద్ధమవుతోంది. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 9న దీన్ని ప్రారంభించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ చకచక ఏర్పాట్లు చేస్తోంది. వీటితో పాటు హెచ్ఎండీఏ పరిధిలో రూపకల్పన చేస్తున్న కాలనీ పార్కులనూ అందుబాటులోకి తేనున్నారు. ఐటీ కారిడార్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే ఔటర్ రింగ్‌రోడ్డుకు ఆనుకొని సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు రెండేళ్ల కిందట హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ పార్కులో తొలిదశ పనులు పూర్తయ్యాయి. మొత్తం రూ.300 కోట్ల అంచనా వ్యయంతో దీనిని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు.

**మొదటి విడతలో..**ఎకో పార్కులో తొలి విడతలో ఎలివేటెడ్ వాక్‌వే, పక్షుల గ్యాలరీ, వివిధ రకాల పూలతో కూడిన ఉద్యానవనం, బటర్‌ఫ్లై పార్కు, పార్కులో అందంగా తీర్చిదిద్దిన పచ్చికబయళ్లను సందర్శకులకు అందుబాటులోకి తేనున్నారు.

**రెండో దశలో..**
ఫేజ్-11 కింద అక్వేరియం, థీమ్ పార్కులు, ఇతర ప్రకృతి అందాలను పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

**ఇవీ ప్రత్యేకతలు...** అందమైన ప్రకృతి రమణీమైన ల్యాండ్‌స్కేపింగ్
దేశంలోనే అతి పెద్దదైన ఏవియరీ
సముద్ర జీవులతో అక్వేరియం
2.5 కిలోమీటర్ల దూరంతో కూడిన ఏలివేటెడ్ వాక్ ప్రాంతం
వివిధ రకాల ఆటలు, సాహసాలతో అడ్వెంచర్ జోన్
అవుటర్ రింగ్‌రోడ్డుకు అటు, ఇటు రాకపోకలు సాగించేందుకు సస్పెన్షన్ వంతెన లగ్జరీ రిసార్టుతో పాటు మినీ కన్వెన్షన్ సెంటర్

# బియ్యం దందాలో భిన్నకోణాలు



భగత్‌నగర్: రేషన్ బియ్యం దందా జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం నిఘా పెట్టినా.. అక్రమాలు ఆగడంలేదు. వీటిని సమూలంగా నియంత్రించాలంటే కీలెరిగి వాతపెట్టడం అన్న చందంగా మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరముంది. పోలీసులు, పౌరసరఫరాల శాఖాధికారులు సమన్వయంతో పని చేస్తే ఈ దందాను పూర్తి స్థాయిలో నిర్మూలించవచ్చు. ఎక్కడెక్కడ అక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు ఏం చేయాలో ‘న్యూస్‌టుడే’ కథనం.

**ఆ మూడింటిని నియంత్రిస్తేనే..**
రేషన్ బియ్యం దందాకు మూడు ప్రాంతాలు ఆయువు పట్టుగా ఉంటున్నాయి. అవి వాహనాలపై తిరుగుతూ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, రేషన్ దుకాణాలు, మండల స్థాయి నిల్వ కేంద్రాలు. వీటి(ఎంఎల్ఎస్)పై నిరంతరం నిఘా తనిఖీలతో జిల్లాలో జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాకు తెరపడే అవకాశముంది.

**1.రిజిస్ట్రేషన్ లేని వాహనాలు..**
నగరంలో వీధి వీధికి తిరుగుతూ నూకలు కొంటాం అంటూ తిరిగే చిరు వ్యాపారులు.. రిజిస్ట్రేషన్ లేని వాహనాలను బియ్యం కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. దీంతోవారు స్వేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ప్రతి వీధి వీధికి తిరుగుతూ సేకరించిన బియ్యాన్ని నగరంలోని ఓ బడా వ్యాపారికి విక్రయిస్తున్నారు. సదరు వ్యాపారి కొందరు రైస్ మిల్లర్లతో వ్యాపార ఒప్పందాలు చేసుకోవడానికి గణేశ్‌నగర్‌లో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్నే ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై దృష్టి పెట్టి.. వారిపై చర్యలు తీసుకోవాలి.

**2.తక్కువగా తూకం వేస్తూ..**
కొందరు రేషన్ దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు గోనె సంచితో బియ్యం తూకం వేస్తున్నారు. సంచి బరువు సుమారు 400 నుంచి 500 గ్రాముల వరకు ఉంటుంది. ఓ కుటుంబంలో నలుగురు ఉంటే వారికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున 24 కిలోల బియ్యం రావాలి. అంటే ఒక్క తూకానికి అర కిలో బియ్యం వరకు దండుకుంటున్నారు. ఇలా పోగేసిన బియ్యాన్ని పక్కా ప్రణాళికతో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణానికి బియ్యం నిల్వలు తీసుకొచ్చిన లారీ నుంచే నేరుగా వ్యాపారులకు బియ్యం అన్‌లోడ్ చేస్తున్నారు. బియ్యం తరలిస్తున్న లారీలకు జీపీఎస్ బదులు సీసీ కెమెరాలను అమర్చినట్లయితే.. ఏ దుకాణాల్లో ఎంతమేర బియ్యం దించారన్న విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించొచ్చు.

**3.మండల స్థాయి నిల్వల కేంద్రంలో..**
మండల స్థాయి బియ్యం నిల్వ కేంద్రాలు దందాలో ఓ భాగంగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో డీలర్‌కు బియ్యం తూకం వేసి బయోమెట్రిక్ తీసుకొని ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మండల స్థాయి నిల్వ కేంద్రం నుంచి డీలరు ఎదుట తూకం వేయకుండానే బియ్యం సరఫరా జరుగుతోంది. దీంతో 50 కిలోల బియ్యం బస్తాకు సంచి బరువు 500 గ్రాములు తగ్గుతోంది. అలాగే తూకం వేయకుండా నేరుగా బియ్యం ఇవ్వడంతో చిరిగిన బస్తాలు వస్తున్నాయి. చిరిగిన బస్తాల్లో కిలో నుంచి 5 కిలోల వరకు డీలర్‌కు తక్కువ వస్తోంది. కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించి ప్రతి డీలర్ తూకం వేసిన బియ్యం తీసుకువెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**ఈ ఆర్థిక సంవత్సరంలో...**
నమోదైన కేసులు : 109 మందిపై
పట్టుకున్న బియ్యం : 4140 క్వింటాళ్లు
బహిరంగ మార్కెట్‌లో విలువ : రూ.85,11,440
వాహనాల సీజ్ : 69
వాటి విలువ : రూ.30,66,000

# సాగునీరు అందేదెప్పుడో?

మల్లాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం విలువైన భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పునరావాస గ్రామాల రైతుల పంటలకు సాగునీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామాల రైతులు పలుమార్లు ఎస్సారెస్పీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. మల్లాపూర్ మండలంలో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి గ్రామాలైన సంగెం, శ్రీరాంపూర్, రత్నాపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వెంపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లోని వందలాది ఎకరాలకు ఏళ్ల తరబడి సాగునీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయ వనరులతో పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి డి29 కాలువ ద్వారా మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాల్వ పైభాగంలో ఉన్న ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్, చిట్టాపూర్, సిరిపూర్ గ్రామాల వరకు మాత్రమే సాగునీరు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయబావులు నిండితే తప్ప పంటలను సాగుచేసుకోలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. నాలుగు సంవత్సరాల కిందట మండలంలోని మొగిలిపేట పెద్దచెరువు కిందిభాగంలో కాలువ లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేయగా పనులు దక్కించుకున్న గుత్తేదారు రెండు కిలోమీటర్ల మేర పనులు చేపట్టి మిగతా పనులు వదిలేశారు. లైనింగ్ లేకపోవడం, భారీ వర్షాలకు



గండ్లు పడటంతో కాలువలోకి వచ్చిన వర్షం నీరు గోదావరిలోకి చేరుతోంది. ఆయకట్టు చివరి పరిధిలో కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడంతో పాటు డి29 కాలువ ఎగువ భాగంలో ఉన్న తూంలకు షట్టర్లు అమర్చితే సాగునీరు అందే పరిస్థితులున్నాయి. ఇటీవల ఎస్సారెస్పీ డీఈ, ఈఈల బృందం కాలువలను పరిశీలించింది. అధిక వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు చేపట్టేందుకు అధికారుల బృందం ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లోపు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. **ఇప్పటికీ న్యాయం జరగడం లేదు..నాలూరి మోహన్, రైతు, శ్రీరాంపూర్**ఏళ్ల తరబడి చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చినా ఇప్పటికీ న్యాయం జరగడంలేదు. అధికారులు సాగునీరు అందేలా చూడాలి.

# మురుగుశుద్ధికి అడుగులు

హైదరాబాద్: మహానగరంలో మురుగుశుద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. మరో 527 ఎంఎల్‌డీల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. డిసెంబరు 3న సీఎం రేవంత్‌రెడ్డి నాగోలు, ఫతేనగర్, మీరాలం, ఖాజాకుంట, పటేల్ చెరువు, సఫీల్‌గూడ మురుగునీటి శుద్ధి కేంద్రాలతోపాటు 19 రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం నగరంలో 31 కేంద్రాలు ఉండగా.. రోజుకు 928 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి అవుతోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా వంద శాతం శుద్ధి చేసిన మురుగుజలాలను నదిలోకి వదలడమే లక్ష్యంగా ఎస్టీపీల నిర్మాణం చేపట్టారు.

**అత్యాధునిక సాంకేతికత..:** జలమండలి ఈ ఎస్టీపీలను సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) సాంకేతికతో నిర్మించింది. నిర్వహణ వ్యయం




కూడా తక్కువ కావడంతో ఉన్నతాధికారులు ఈ సాంకేతికతకు మొగ్గు చూపుతున్నారు. మురుగునీటిలో వ్యర్థాల శుద్ధిలో అత్యధిక సామర్థ్యం ఉండటం, బహుముఖంగా పనిచేయడంతోపాటు నిర్దేశించిన ప్రమాణాల మేరకు శుద్ధి చేసిన జలాలను బయటకు పంపుతుంది. సింగిల్ బ్యాచ్ రియాక్టర్‌లో పనిచేస్తుంది. స్లడ్జ్‌లో ఉండే బ్యాక్టీరియా కీలకంగా వ్యవహరిస్తుంది.

# ఆసుపత్రులు పెరిగితేనే సేవలు మెరుగు

కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆరోగ్యశ్రీ ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్యను పెంచుతామనే ప్రకటనతో ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 64,534 శస్త్రచికిత్సలు జరిగాయి. అదే 2023 జనవరి నుంచి డిసెంబరు 8 వరకు 60,627 మంది ఉచిత వైద్యాన్ని పొందారు.రూ.10 లక్షల పెంపు తరువాత ఖరీదైన వైద్యం అవసరం అయినవారికి చికిత్సపరంగా ఊరట లభిస్తోంది. జగిత్యాల జిల్లాలో ఇద్దరు, కరీంనగర్‌లో ఒకరు ఈ పెంపు ప్రయోజనాన్ని అందుకున్నారు. రూ.9.25 లక్షల వ్యయంతో కరీంనగర్‌కు చెందిన సందేశ్ అవయవ మార్పిడి చేసుకున్నారు. జగిత్యాలకు చెందిన ఇద్దరు రూ.10 లక్షలకుపైగా సాయం పొందారు.


**కొత్తగా 163 వ్యాధులకు..**
ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 1375 రకాల చికిత్సలకు సగటున 25 శాతం ధరలు పెంచి.. కొత్తగా 163 వ్యాధులను ఇందులో చేర్చింది. గతంలో ఈ పథకం ద్వారా 1672 రకాల ప్యాకేజీల సేవలు అందగా.. పెంచినవాటితో మొత్తం 1835కి పెరిగింది. కొందరికి రేషన్‌కార్డు లేనివారికి ముఖ్యమంత్రి కార్యాలయ అనుమతితో రోగికి చికిత్స అందిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులున్నవారికి సైతం వర్తింపజేస్తున్నారు.

**తోడ్పాటు అందిస్తున్నాం**
**విజయ్‌కుమార్ మేనేజర్, ఉమ్మడి జిల్లా**
ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సేవలందించేందుకు తోడ్పాటునిస్తున్నాం. నాలుగు జిల్లాల పరిధిలో ప్రస్తుతం 78 మంది ఆరోగ్య మిత్రలున్నారు. ప్రతి ఆస్పత్రి వద్ద వారి పేరు, వివరాలుంటున్నాయి. ఉచిత సహాయ నంబరు 104ను సంప్రదించినా సేవల గురించి సమాచారమందిస్తారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా మరిన్ని ఆస్పత్రుల సంఖ్య పెరిగే వీలుంది.

**పెరిగితేనే ప్రయోజనం..**పెద్దపల్లి జిల్లాలో కేవలం ఒక్క ప్రైవేటు ఆస్పత్రి మాత్రమే పేదలకు ఉచితంగా సేవలందిస్తోంది. మిగతావి ఆసక్తి చూపడం లేదు.నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 1300కుపైగా ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఇందులో కనీసం అయిదోవంతు ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ లేదు.జమ్మికుంటలో ఇటీవల చిన్నపిల్లల ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో చేరింది. కొన్నిరకాల చికిత్సల ఆస్పత్రులు జిల్లాల్లో లేక ఇబ్బంది నెలకొంది.

# చలిలోనూ పెరిగిన విద్యుత్తు వినియోగం

హైదరాబాద్: రాష్ట్రంలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, శీతలగాలులు వీస్తుండటంతో వాతావరణం పొడిగా మారింది. దీంతో విద్యుత్తు డిమాండ్ తక్కువగా



ఉంటుందనే అంచనాలకు భిన్నంగా రాష్ట్రంలో కొద్దిరోజులుగా పెరిగింది. గతేడాది నవంబరు 26న 9170 మెగావాట్ల డిమాండ్ ఉంటే.. ఈసారి 10698 మెగావాట్లకు పెరిగింది. గతేడాది నవంబరు 27న 9387 మెగావాట్ల డిమాండ్ నమోదైతే... ఈ ఏడాది ఇదే రోజు 10843 మెగావాట్ల డిమాండ్ రికార్డైంది.

వినియోగం డబుల్ సెంచరీ దాటింది.. ఈ నెల 26, 27 తేదీల్లో 200.83, 200.80 మిలియన్ యూనిట్ల వినియోగం రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇవే రోజుల్లో 192.37, 195.97 మిలియన్ యూనిట్లు మాత్రమే నమోదైంది. హైదరాబాద్‌లోనూ..విద్యుత్తు డిమాండ్ గతేడాది నవంబరు 26న 2535 మెగావాట్ల ఉండగా.. ఈసారి 2973 మెగావాట్లకు పెరిగింది. నవంబరు 27న గతేడాది 2835 మెగావాట్లు నమోదు కాగా.. ఈసారి 3001 మెగావాట్లకు పెరిగింది. వినియోగంలోనూ పెరుగుదల నమోదైంది. 2023 నవంబరు 26న 49.57 మిలియన్ యూనిట్లు, నవంబరు 27న 53.56 మి.యూ. నమోదైంది. ఈ ఏడాదికి అవే రోజుల్లో 56.56, 56.06 మిలియన్ యూనిట్లు రికార్డైంది.

కారణాలేమై ఉంటాయ్... రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య పెరగడం, పరిశ్రమల పరంగా వాడకం, ఉదయం పూట ఇళ్లలో గీజర్ల వినియోగం అధికమవడం వంటి కారణాలతో విద్యుత్తు డిమాండ్ మునుపటి ఏడాది కంటే ఎక్కువగా ఉందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు అన్నారు.




అమరావతి: ఏపీలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కళాశాలలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, ఎంపీ శివనాథ్, బొండా ఉమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో లోకేశ్ మాట్లాడారు. బాగా చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుందని.. మంచి ఉద్యోగం వస్తే మీ కుటుంబాన్ని బాగా చూసుకోవచ్చని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. "మంగళగిరిలో 2019లో నేను ఓడిపోయాను. కానీ పట్టుదలతో పరిశ్రమించి రికార్డుస్థాయి మెజారిటీతో గెలిచాను. జీవితంలో గెలుపు ఓటములు సహజం. పరీక్షలు తప్పినందుకే చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. విద్యార్థులు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలని నిర్ణయించాం. అందుకే ప్రముఖుల పేర్లతో పథకాలు ప్రారంభించాం. సమానత్వం విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలి. పుస్తకాల్లో ఆటలకు పురుషుల బొమ్మలు, ఇంటి పనులకు బాలికల బొమ్మలు ఉన్నాయి. పాఠ్య పుస్తకాల్లో ఈ అసమానతలను తొలగించాలని ఆదేశించాను" అని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుండగా గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటర్ కళాశాలల్లో నిలిపివేశారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించారు.



## వైకుంఠ ద్వార దర్శనం.. సామాన్య భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు: బీఆర్ నాయుడు

తిరుమల: తితిదే ఈవోతో టోకెన్ల జారీ ఏర్పాట్లపై చర్చించినట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి సర్వదర్శన టోకెన్ కౌంటర్ల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. సామాన్య భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. వీఐపీలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 9న ఉదయం 5.30 గంటలకు కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్ల జారీ చేయనున్నారు. తిరుపతిలోని 9 కేంద్రాల్లో 91 కౌంటర్లలో టోకెన్లు ఇవ్వనున్నారు. తోపులాటలు జరగకుండా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

## రూరల్ ఇండియా మహోత్సవ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

ఢిల్లీ : రూరల్ ఇండియా ఫెస్టివల్ 2025ను ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి గ్రామంలోని ప్రజలకు సేవ చేస్తున్నామని, అభివృద్ధి చెందిన భారత్ 2047 కోసం సమ్మిళిత గ్రామీణ భారతదేశాన్ని సృష్టించడమే ఈ పండుగ థీమ్ అన్నారు.

గ్రామీణ భారతదేశం వ్యవస్థాపక స్ఫూర్తి, సాంస్కృతిక వారసత్వాన్ని పెంచడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని మోదీ ఈ ఉత్సవాలను ప్రారంభించారు. రూరల్ ఇండియా మహోత్సవాలు జనవరి 4 నుంచి జనవరి 9 వరకు నిర్వహించబడాయి.

**ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారు?...** ఈ సందర్భంగా 2025వ సంవత్సరానికి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు ప్రధాని మోదీ. 2025 ప్రారంభంలో గ్రామీణ భారత మహోత్సవ్‌లోని ఈ మహత్తర కార్యక్రమం భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని పరిచయం చేస్తోందని, ఒక గుర్తింపును సృష్టిస్తోందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నాబార్డ్, ఇతర భాగస్వాములను అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం లక్షలాది గ్రామాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు చేరుతోందని ప్రధాని మోదీ అన్నారు. నేడు ప్రజలు 1.5 లక్షల కంటే ఎక్కువ ఆయుష్మాన్ ఆరోగ్య సేవల కోసం మెరుగైన ఎంపికలను పొందుతున్నట్లు చెప్పారు.


**ఆర్థిక విధానాలు కూడా..** డిజిటల్ టెక్నాలజీ సాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులను, ఆసుపత్రులను గ్రామాలకు అనుసంధానం చేశాం. అనేక మంది టెలిమెడిసిన్ ప్రయోజనాన్ని పొందారు. ఇ సంజీవని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది మంది ప్రజలు టెలిమెడిసిన్‌ను సద్వినియోగం చేసుకున్నారు. కోవిడ్ సమయంలో భారతదేశ గ్రామాలు ఈ అంటువ్యాధిని ఎలా ఎదుర్కొంటాయని ప్రపంచం ఆశ్చర్యపోతోంది. కానీ మేము ప్రతి గ్రామంలో చివరి




వ్యక్తికి వ్యాక్సిన్లలను పంపిణీ చేశాము. ఈ సందర్భంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, గ్రామంలోని ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ గుర్తు చేశారు.

**ఈ కార్యక్రమంలో..** ఈ పండుగ సందర్భంగా గ్రామీణ భారతదేశం వ్యవస్థాపక స్ఫూర్తి, సాంస్కృతిక వారసత్వం జరుపుకుంటారు. గ్రామీణ మౌలిక సదుపాయాలను పెంపొందించడం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థను నిర్మించడం, గ్రామీణ సమాజంలో ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో మహోత్సవ్ వివిధ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంది. గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచడానికి సాంకేతికత, వినూత్న పద్ధతులను ఉపయోగించుకోవడం గురించి చర్చలను ప్రోత్సహించడం. వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ఆలోచనాపరులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, కళాకారులు, వాటాదారులను కలిసి సహకార, సామూహిక గ్రామీణ పరివర్తన కోసం ప్రణాళిక రూపొందించడం. దీంతోపాటు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడంతో పాటు వ్యవస్థాపకత ద్వారా గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## చిత్తూరులో సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారు..



అమరావతి, జనవరి 4: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు చంద్రబాబు జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 6 నుంచి 8 వరకు చిత్తూరు జిల్లాలో సీఎం పర్యటన సాగనుంది. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే డ్వాక్రా సంఘాలతో సమావేశంకానున్నారు. పలు ప్రారంభోత్సవాలు, యువతతో సమావేశాలు నిర్వహించనున్నారు సీఎం. ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటలకు ద్రవీడియన్ యూనివర్సిటీలో స్వర్ణ కుప్పం విజన్ 2029 కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రకృతి వ్యవసాయం విజన్‌లను ప్రారంభిస్తారు.

అనంతరం స్వర్ణకుప్పం విజన్ 2029 పై చర్చించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అగారాం కొత్తపల్లి గ్రామానికి వెళ్లి డ్వాక్రా సంఘాలతో సీఎం మాటామంతి నిర్వహించనున్నారు. 2:30 గంటలకు నడిమూరు గ్రామంలో సౌర విద్యుతీకరణ కార్యక్రమం ప్రారంభం అనంతరం స్థానిక యువతతో ఇష్టాగోష్టిలో పాల్గొటారు. అనంతరం సిగాల పల్లెకు చంద్రబాబు చేరుకుంటారు. సాయంత్రం 5:30 గంటలకు ద్రవీడియన్ యూనివర్సిటీ ఆడిటోరియంలో పార్టీ క్యాడర్‌తో సమావేశం అవుతారు. రాత్రి 7:30 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు బస చేయనున్నారు.

**7వ తేదీన సీఎం కార్యక్రమాలు...** 7న ఉదయం 10 గంటలకు కుప్పం టీడీపీ ఆఫీసుకు సీఎం చేరుకుంటారు. అక్కడ జన నాయకుడు సెంటర్‌ను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం ప్రజల నుంచి అర్జీల స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కంగుండి గ్రామానికి వెళ్లనున్న సీఎం.. శ్యామన్న విగ్రహన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కుప్పం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చంద్రబాబు వెళ్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకూ మథర్ డెయిరీ, శ్రీజా మహిళా పాల సేకరణదారుల సంస్థను సీఎం చేతుల మీదుగా ప్రారంభంకానుంది. ఎన్టీఆర్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కాడా కమండ్ కంట్రోల్ రూం, మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం హాజరుకానున్నారు. ఐఐటీ కాన్పూర్‌తో అవగాహన కుదుర్చుకుని కుప్పాన్ని నెట్ జీరో నియోజకవర్గంగా మార్చే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. మహిళా శక్తి భవన్‌లో ఏలీప్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నారు. సీఈవో బిగ్ బాస్కట్, ఎన్డీడీపీ ఛైర్మన్‌లతో సమావేశం అవుతారు. సాయంత్రం 4:45 గంటలకు కుప్పంలోని తమ నివాసానికి ముఖ్యమంత్రి చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు ద్రవీడియన్ యూనివర్సిటీలో అకడమిక్ సెంటర్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు..అధికారులతో అక్కడే సమావేశం అవనున్నారు. రాత్రికి కుప్పం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌తో రెండవ రోజు చంద్రబాబు బస చేయనున్నారు. తిరిగి ఎనిమిదివ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

## తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులపై మంత్రులు ఏమన్నారంటే..

అమరావతి, జనవరి 4: ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులో ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 90 శాతం మంది తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్న రాష్ట్రంలో తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం సహేతుకమని ప్రభుత్వం పేర్కొంది. ఈమేరకు నిన్న (శుక్రవారం) ఇంగ్లీషు, తెలుగులోనూ జీఓ ఎంఎస్ నెంబర్ 3ను సాధారణ పరిపాలన శాఖ జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలన్న సర్కార్ నిర్ణయంపై మంత్రులు స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇన్నాళ్లుగా తెలుగు భాషాభిమానులు, రచయితలు, కవులు కోరుకుంటున్నట్లుగా ఇక నుంచి తెలుగులో ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడనున్నాయన్నారు. 90 శాతం మంది తెలుగు మాట్లాడే ప్రజలున్న రాష్ట్రంలో తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా పరిపాలన మరింత పారదర్శకంగా మారనుందని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి కోసం దివంగత నేత ఎన్టీఆర్ చేసిన కృషిని సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారు. ఒకవైపు ఆంగ్ల భాషలో ప్రవీణ్యం పెంచుకుంటూనే తల్లి భాష తెలుగులోని తియ్యదనాన్ని కూడా అందరూ అస్వాదించాలని మంత్రి అనగాని సత్యప్రాసాద్ పేర్కొన్నారు.

**చంద్రబాబుకు కృతజ్ఞతలు: మంత్రి అచ్చెన్న...** అమ్మలాంటి



మాతృభాషను గత ప్రభుత్వం అవమానపరిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతృభాషకు చంద్రబాబు హయాంలో సముచిత గౌరవం లభించిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనూ ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలుగు భాష పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతోందని తెలిపారు. సామాన్య ప్రజలు, పల్లెల్లో ప్రజానీకం అన్ని విషయాలు తెలుసుకునే విధంగా పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

**మరో మైలురాయి: రాంప్రసాద్...** ప్రభుత్వ పాలనలో కీలకమైన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) తెలుగులో జారీచేయడం మాతృ భాషకు పట్టం కట్టేందుకే అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. దేశంలోనే మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు తెలుగులో ఉత్తర్వులు ఇవ్వడం అనేది తెలుగుకు సముచిత గౌరవం ఇచ్చినట్లే అని తెలిపారు. తెలుగు మాతృభాష పట్ల సీఎం చంద్రబాబు ఔన్నత్యాన్ని చాటుకున్నారన్నారు. తెలుగు సంస్కృతి ఉనికికి ఈ నిర్ణయం మరో మైలు రాయి అని మంత్రి రాంప్రసాద్ పేర్కొన్నారు.

## ఒక చిన్న ప్రాజెక్టు రాయలసీమలో అనేక మార్పులకు కారణమైంది: మంత్రి పయ్యావుల



విజయవాడ: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా ఉండాలని సీఎం చంద్రబాబు చెప్పారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. "పోలవరం అంటే ఒక జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టు కాదు. పోలవరం అంటే రాయలసీమకు, ఉత్తరాంధ్రకు, ఈ రాష్ట్ర రైతాంగానికి వరం. పట్టిసీమ ప్రాజెక్టు కట్టకముందు రాయలసీమలో నీటి కోసం యుద్ధాలు జరిగేవి. తుంగభద్ర హై లెవెల్ కెనాల్‌లో నీళు తక్కువ వస్తే.. రెండు టీఎంసీల నీటిని కర్నూలు నుంచి మళ్లించి ఇవ్వమని అనంతపురం జిల్లా రైతులు ధర్నా చేసేవారు. కర్నూలు వాళ్లు ఇవ్వొద్దని ధర్నా చేసే పరిస్థితి ఉండేది. పట్టిసీమ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రైతుల ఆందోళనలు తగ్గాయి. కరవు గురించి శాసనసభలో చర్చలే లేకుండా పోయిన పరిస్థితి. ఒక చిన్న ప్రాజెక్టు రాయలసీమ భూభాగంలోని అనేక మార్పులకు కారణమైంది.

**గత ఐదేళ్లలో పోలవరం పనులు ఆపిందెవరో జగన్ చెప్పాలి?..** పోలవరంపై సీఎం చంద్రబాబు ప్రధానంగా దృష్టిసారించారు. పోలవరం పూర్తిచేయడంతో పాటు బనకచర్ల వరకు నీళ్లు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు రాయలసీమ ఇరిగేషన్‌కు గుండెకాయ లాంటిది. అక్కడి నుంచే కర్నూలు, నంద్యాల, కడప, చిత్తూరు, అనంతపురం తదితర ప్రాంతాలకు నీరు చేరుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లేందుకు నదుల అనుసంధాన ప్రాజెక్టును కూడా చేపట్టబోతున్నారు. అందుకే పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయబోతున్నారు. గత ఐదేళ్లలో పోలవరం పనులు ఆపిందెవరో జగన్ చెప్పాలి? మేం ఇచ్చిన హామీలు మాకు తెలుసు.. మీరు చెప్పనక్కర్లేదు. మేం వచ్చాక 74 కేంద్ర పథకాలు మళ్లీ అమలు చేస్తున్నాం. ఏ రాష్ట్రానికీ లేని అప్పు మన రాష్ట్రానికి ఉందంటే జగనే కారణం. ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతుకు డబ్బు చెల్లిస్తున్నాం. మీరు చేసినట్టు ధాన్యం కొనుగోలు కేంద్రాలు మేం మూసేయలేదు. రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మేం పనిచేస్తున్నాం" అని పయ్యావుల కేశవ్ తెలిపారు.

## గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసింది: మంత్రి అచ్చెన్నాయుడు



వడ్లమూడి: గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. కనీసం రైతులకు అవసరమైన యంత్రాలను అందించలేకపోయిందని మండిపడ్డారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్, విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్తంగా రైతులకు ప్రకటించిన పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తామని చెప్పారు. సాగులో డ్రోన్ టెక్నాలజీని సమర్థంగా అమలు చేస్తామన్నారు. భూసార పరీక్షలకు ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నట్లు చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఈ పద్ధతిలో పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో రైతులకు అందిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

## అడవిలో తప్పిపోయిన బీటెక్ విద్యార్థులు.. ఆపై సుడిగుండంలో పడి..

అన్నమయ్య: సరదాగా గడిపేందుకు ఎంతో హుషారుగా శేషాచలం వెళ్లిన విద్యార్థులకు అనుకోని ఘటన ఎదురైంది. జీవితంలో ఎప్పుడూ చూడని కఠిన పరీక్ష సవాల్ విసిరింది. విషాదయాత్ర కాస్త విషాదాంతంగా ముగిసింది. వాటర్ ఫాల్స్ చూడాలన్న సరదా వారిని అడవిపాలు చేసింది. ప్రమాదవశాత్తూ ఒకరు మృతిచెందగా.. మిగతా విద్యార్థులంతా అడవిలో తప్పిపోయారు. రాత్రంతా ఆ అడవిలోనూ బిక్కుబిక్కుమంటూ గడిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో కథ మలుపు తిరిగింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు విహారయాత్ర కోసం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పరిధిలోని శేషాచలం అడవులకు నిన్న(శుక్రవారం) వెళ్లారు. నిన్న ఉదయం శేషాచలం వాటర్ ఫాల్స్ వద్దకు చేరుకున్న యువకులంతా మధ్యాహ్నం వరకూ అటవీ ప్రాంతాన్ని కలియ తిరిగారు. అనంతరం సరదాగా ఈతకొట్టేందుకు వాటర్ ఫాల్స్‌లోకి దిగారు. అయితే కాసేపటికే వాటర్ ఫాల్ వద్ద సుడిగుండం ఏర్పడింది. దీంతో ఈతకు దిగిన విద్యార్థి సాయిదత్త అందులో చిక్కుకుపోయాడు. అతడిని రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించి విఫలం అయ్యారు. చివరికి సాయిదత్త ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. స్నేహితుడు సాయిదత్త మరణాన్ని దిగమింగుకుంటూ మృతదేహాన్ని తీసుకుని అటవీ మార్గం గుండా మిగిలిన ఐదుగురు విద్యార్థులు బయలుదేరారు. అయితే అప్పటికే సూర్యాస్తమయం




కావడం, చీకటి కమ్ముకోవడంతో వారంతా శేషాచలం అడవుల్లో దారితప్పారు. నిన్న సాయంత్రం నుంచీ అర్ధరాత్రి వరకూ అడవిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ కూడా లేకపోవడంతో ఎవరికి విషయం చెప్పాలో అర్థంకాక బోరున విలపించారు.

కాసేపటి తర్వాత ఓ విద్యార్థి ఎట్టకేలకు తాము తప్పిపోయినట్లు పోలీసులకు సమాచారం అందించాడు. తామున్న లొకేషన్‌ను వారికి షేర్ చేశాడు. దీంతో రంగంలోకి దిగిన రైల్వేకోడూరు పోలీసులు, అటవీశాఖ అధికారులు వారిని రక్షించేందుకు బయలుదేరారు. అర్ధరాత్రి వేళ విద్యార్థులున్న ప్రాంతానికి చేరుకుని వారిని సురక్షితంగా రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

## భక్తులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి: మంత్రి ఆనం

విజయవాడ: రాష్ట్రంలోని ఆలయాల ఆధునికీకరణ, అభివృద్ధి, మెరుగైన సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కొత్త ఏడాదిలో తొలిసారిగా ఇంద్రకీలాద్రికి వచ్చిన మంత్రికి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో రామచంద్ర మోహన్, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

దర్శనం పూర్తయ్యాక మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆ దుర్గమ్మను కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ అధికారులతో సమావేశమైన ఆనం.. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని.. భక్తులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాద పూర్వకంగా ప్రవర్తించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



## అనసూయ గ్లామర్ డోస్.. అగ్గి రాజేసిందిగా!

స్మాల్ స్క్రీన్ యాంకర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసి.. ఇప్పుడు నటిగా సినిమాలతో అనసూయ ఫుల్ బిజీగా గడుపుతున్న విషయం తెలిసిందే. సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ గ్యాప్ లోనే ముద్దుగుమ్మ మంచి ఫేమ్ దక్కించుకుందనే చెప్పాలి. అదే సమయంలో తన గ్లామర్ తో అమ్మడు ఎప్పటికప్పుడు చేసే సందడి మాములుగా ఉండదు. సినిమాలు, షూటింగ్స్ తో ఎంత బిజీగా ఉన్నా.. ఫ్యామిలీతో క్వాలిటీ టైమ్ స్పెండ్ చేస్తుంటుంది అనసూయ. ఎప్పటికప్పుడు భర్త, పిల్లలతో వెకేషన్స్ కు వెళ్తూ ఫుల్ గా చిల్ అవుతుండడం మనం చూస్తూనే ఉంటాం. మాగ్జిమమ్ ఏ ఫెస్టివల్ ను కూడా ఆమె మిస్ కారు. అటు ఎంజాయ్ చేస్తూ.. ఇటు పూజలూ చేస్తుంటుంది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా తన ఫ్యామిలీతో సెలబ్రేషన్స్ జరుపుకుంది అనసూయ. అందుకు సంబంధించిన పిక్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. సింపుల్ గా ఇంటర్నెట్ ను షేక్ చేస్తున్నాయనే



చెప్పాలి. నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అవుతూ.. లైకులు కొడుతూ.. షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు. అయితే డీప్ నెక్ మోడ్రన్ డ్రెస్ వేసుకున్న అనసూయ.. గ్లామర్ షో గేట్లను పూర్తిగా ఎత్తేసినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఓ రేంజ్ లో అందాలను హైలెట్ చేస్తూ.. తన స్కిన్ షోతో అదరగొట్టేసింది. సింపుల్ నెక్లెస్ వేసుకున్న ఆమె పిక్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తున్నాయి.. వేరే లెవెల్ లో సెగలు కూడా రేపుతున్నాయి. పిక్స్ ను షేర్ చేస్తూ అనసూయ.. హ్యాపీ 2025 మై లవ్లీస్ అంటూ విష్ చేసింది. "గత ఏడాది మనలో చాలా మందికి కష్టంగా సాగిందని తెలుసు. అయితే సన్ సెట్ ను రీసెట్ చేసుకోవడానికి ఓ ఛాన్స్.. ప్రతి సన్ రైజ్ కొత్త కళ్ళతో స్టార్ట్ అవుతుంది. కానీ రోజూ ఏదో ఒక తప్పు చేసేయకండి" అంటూ అనసూయ రాసుకొచ్చింది. ఇక కెరీర్ విషయానికొస్తే.. రీసెంట్ గా పుష్ప 2: ది రూల్ మూవీలో సందడి చేసిన అనసూయ.. యాక్టింగ్ కు గాను మంచి ప్రశంసలు అందుకుంది. అయితే ఆమె కోసమే రచయితలు సినిమాలో కొన్ని పాత్రలు సృష్టిస్తున్నారని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. దాని బట్టి ఆమె ఎలాంటి క్రేజ్ సంపాదించుకుందో తెలుస్తోంది. మరి ఫ్యూచర్ లో అనసూయ.. తన చిత్రాలతో ఎలా అలరిస్తుందో వేచి చూడాలి.

## ప్రియా వారియర్ ఇదో సర్ ప్రైజ్ మురిపం!

స్విమ్మింగ్ పూల్ లో జలకాలట కోసం... లేక్ లో..బీచ్ లో ఈత కోసం హీరోయిన్లు అంతా స్విమ్ షూట్లు వేస్తారు. టూపీస్ లు ధరిస్తారు. రకరకాల బికినీలు వేసుకుంటారు. వాటిలో అందాలు ఆరబోస్తు కెమెరాకి రకరకాల భంగిమల్లో ఫోజు లిస్తుంటారు. వాటిని అంతర్జాలంలోకి వదిలి నెటి జనుల్ని ఖుషీ చేస్తుంటారు. ఇదందా ఓ పద్దతిగా పోతుంది. కానీ ఇలాంటి జలకాలాట కోసం మ్యాప్ వేసుకుని..అందంగా ముస్తాబై..పట్టు లంగావోణీ లు లాంటివి ఎవరైనా ధరించి చూసారా? అంటే ఇదొక్కడి చోద్యం అంటారు. కానీ ఓవర్ నైట్ స్టార్ ప్రియా ప్రకాష్ వారియర్ అలా భిన్నంగా ట్రై చేసి సక్సెస్ అయింది. ఇదిగో ఇక్కడిలా స్విమ్మింగ్ పూల్ లో అమ్మడి పోటో సెషన్



చూస్తే స్టన్ అవ్వాల్సిందే. రెండు చేతులకు మల్లె పూలు ధరించింది. ఎంతో అందంగా హెయిర్ స్టైల్ చేసుకుంది. మ్యాకప్ వేసుకుంది. నుదిటిన రూపాయి బిళ్లంగా బొట్టు పెట్టుకుంది. పట్టు పరికిణీ ధరించింది. టాప్ లో మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది. ఇదే దుస్తుల్లో ఈత కొలనులోకి దిగి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రియాని అలా చూసి అంతా స్టన్ అవుతున్నారు. రెగ్యులర్ స్విమ్ షూట్లకు భిన్నంగా ఇలా ట్రై చేసింది. యూనిక్ గానూ హైలైట్ అవుతుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ప్రియా స్కిన్ షోకి యువత ఫిదా అవుతుంది. ప్రియాపై ఫోజులుపై ఎవరి స్టైల్లో వారు కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీకి మెరుపులా వచ్చింది. స్టార్స్ తో అవకాశాలు అందుకుంది. అయితే సక్సెస్ లు సరైనవి పడలేదు. లేదంటే? అమ్మడి కెరీర్ మరోలా ఉండేది. ప్రస్తుతం అవకాశాలు చేతిలో బాగానే ఉన్నాయి. హిందీ, కన్నడలోనే సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళ్ లో మాత్రం కొత్త అవకాశాలు రాలేదు.




## ఒకప్పుడు ఆమె సుమ కంటే టాప్ యాంకర్.. విలన్ గా రీ ఎంట్రీ?



తెలుగు బుల్లితెరపై స్టార్ యాంకర్స్ అంటే అందరికి బాగా గుర్తుకొచ్చే వారు సుమ. ఆమె తరువాత ఝాన్సీ, అనసూయ. సుమ ఇప్పటికి స్టార్ యాంకర్ గా తన చరిష్మాని కొనసాగిస్తోంది. ఇక ఝాన్సీ బుల్లితెరకి స్వస్తి చెప్పి యాంకర్ గా సెటిల్ అయిపోయింది. అడపాదడపా సినిమాలు చేస్తోంది. 'సలార్' సినిమాలో పవర్ ఫుల్ పాత్రలో ఝాన్సీ కనిపించింది. ఇక అనసూయ యాంకరింగ్ కి స్వస్తి చెప్పి చాలా తక్కువ టైం అయ్యింది. 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప 2' సినిమాల తర్వాత అనసూయ నటిగా ఫుల్ బిజీ అయిపోయింది. ప్రస్తుతం ఆమె ఫుల్ టైం యాక్టర్ గానే కొనసాగుతోంది. ఇక సీనియర్ యాంకర్ ఉదయభాను ఒకప్పుడు బుల్లితెరపై చక్రం తిప్పింది. తన అందం, మాటలతో అందరిని అలరించింది. మరల ఇప్పుడిప్పుడే కొన్ని షోలు చేస్తూ ఇమేజ్ బిల్డ్ చేసుకునే పనిలో పడింది. నిజానికి ఉదయభాను నటిగానే కెరియర్ స్టార్ట్ చేసింది. ఆర్ నారాయణమూర్తి 'ఎర్ర సైన్యం' సినిమాతో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత హిందీలో పౌరాణిక సీరియల్ లో సీత పాత్రలో నటించింది. నెక్స్ట్ కొన్ని కన్నడ సినిమాలలో హీరోయిన్ గా నటించింది. అయితే ఏవీ ఆమెకి సక్సెస్ తీసుకురాలేదు. 'లీడర్', 'జులాయి' సినిమాలలో స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది. అలాగే 2013లో 'మధుమతి' అనే మూవీలో హీరోయిన్ గా ఉదయభాను చేసింది. తరువాత చాలా కాలం బుల్లితెరకి, ఇటు నటనకి దూరమైంది. 2024 నారా రోహిత్ 'ప్రతినిధి 2' చిత్రంలో ఉదయభాను కనిపించింది. ఇదిలా ఉంటే ఈమె ప్రస్తుతం ఓ మూవీలో పవర్ ఫుల్ విలన్ గా కనిపించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంట. సత్యరాజ్ లీడ్ రోజ్ లో 'బార్బరిక్' అనే మూవీ రెడీ అయ్యింది. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ మూవీలో ఉదయభాను విలన్ గా కనిపించబోతోందంట. తమిళంలో విజయ్ సేతుపతి హీరోగా వచ్చిన మహారాజ స్టైల్ లో అదిరిపోయే ట్విస్ట్ లతో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో ఈ 'బార్బరీక్' మూవీ ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. మరి ఈ సినిమా ఆమెకి నటిగా కమర్షియల్ బ్రేక్ ఇచ్చి టాలీవుడ్ స్టార్ యాక్టర్ ని చేస్తుందేమో చూడాలి. ఒక వేళ ఉదయభాను వెండితెరపై సక్సెస్ అయితే ఆమె కోసం ప్రత్యేకంగా పాత్రలు సృష్టించే దర్శకులు చాలా మంది ఉంటారు. అలాగే పెద్ద ప్రొడక్షన్స్ లలో కూడా అవకాశాలు వచ్చే ఛాన్స్ ఉంది. హీరోయిన్ గా సక్సెస్ కాలేకపోయిన ఉదయభాను ఇలా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా అయిన విజయం అందుకుంటుందేమో చూడాలి.

## ఎకో-ఫ్రెండ్లీగా 'జరగండి'.. 'గేమ్ ఛేంజర్' సాంగ్స్ స్పెషాలిటీ ఏంటంటే?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ ఎస్. శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కిన సినిమా "గేమ్ ఛేంజర్". దిల్ రాజు ప్రొడక్షన్ లో అత్యంత భారీ బడ్జెట్ తో ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న గ్రాండ్ గా థియేటర్లలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ మూవీ నుంచి నాలుగు పాటలను విడుదల చేసారు. ఎస్. థమన్ కంపొజిషన్ లో వచ్చిన ఈ సాంగ్స్ అన్నీ, శంకర్ శైలిలో గ్రాండ్ స్కేల్ లో వేటికవే ప్రత్యేకంగా షూట్ చేయబడ్డాయి. 'గేమ్ ఛేంజర్' సినిమా మేకింగ్ కి ? 300 కోట్లకు పైగానే బడ్జెట్ అయింది. అందులో ? 75 కోట్లు కేవలం ఈ నాలుగు పాటల చిత్రీకరణ కోసమే ఖర్చు చేసినట్లుగా తెలుస్తోంది. 'జరగండి' పాటను తీసుకుంటే, 70 అడుగుల భారీ హిల్ విలేజ్ సెట్ లో గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఎకో ఫ్రెండ్లీ కాస్ట్యూమ్స్ తో రూపొందించారు. ప్రభుదేవా కొరియోగ్రఫీ చేసిన ఈ సాంగ్ ను 13 రోజుల పాటు షూటింగ్ చేశారు. ఇందులో రామ్ చరణ్ – కియారా అద్వానీతో పాటుగా 600 మంది డ్యాన్సర్లు పాల్గొన్నారు. వీరంతా కూడా జ్యూట్ (జనపనార)తో తయారు చేసిన ఎకో–ఫ్రెండ్లీ కాస్ట్యూమ్స్ ధరించడం విశేషం. 'రా మచ్చా మచ్చా' పాటని ఇండియా ఫోక్ డ్యాన్స్ కి ట్రిబ్యూట్ గా చిత్రీకరించారు. గణేష్ ఆచార్య మాస్టర్ దీనికి కొరియోగ్రఫీ చేసారు. చరణ్ తో పాటుగా 1000 మంది డ్యాన్సర్లతో సాంగ్ ను షూట్ చేసారు. ఇందులో భారతదేశపు గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని సెలబ్రేట్ చేసుకోవడాన్ని హైలైట్ చేసారు. అలానే న్యూజిలాండ్ లో రామ్ చరణ్ – కియారాల మీద తీసిన 'నానా హైరానా' గీతం అద్భుతమైన బ్యూటిఫుల్ మెలోడీ అనిపించుకుంది. పాశ్చాత్య, శాస్త్రీయ సంగీతం మిశ్రమంగా థమన్ ట్యూన్ కంపోజ్ చేసారు. ఇది ఇండియాలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో షూట్ చేసిన మొట్టమొదటి పాటగా నిలిచింది. 'దోప్' సాంగ్ విషయానికొస్తే, ఇదొక హై ఎనర్జీ టెక్నో ఆంథమ్. దీనికి జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేసారు. రామ్ చరణ్ – కియారా తమ ఎనర్జిటిక్ స్టెప్పులతో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. 100 మంది రష్యన్ డ్యాన్సర్లతో 8 రోజుల పాటు ఈ పాటను చిత్రీకరించారు. ఇటీవల యూఎస్ లో నిర్వహించిన ఈవెంట్ లో ఈ సాంగ్ ను లాంచ్ చేసారు. ఇలా 'గేమ్ ఛేంజర్' సినిమాలోని నాలుగు పాటలు కూడా ఏదొక స్పెషాలిటీ కలిగి ఉన్నాయి. శంకర్ గత చిత్రాల మాదిరిగానే విజువల్ గ్రాండియర్ గా, భారీ బడ్జెట్ తో ఈ సాంగ్స్ ని రూపొందించారని అర్థమవుతోంది. కేవలం నాలుగు పాటల కోసం 75 కోట్లు ఖర్చు చేసారంటే, బిగ్ స్క్రీన్ మీద ఆడియన్స్ కి ఎలాంటి అనుభూతిని పంచుతాయనే ఆసక్తి రెట్టింపు అవుతోంది. శంకర్ మార్క్ పొలిటికల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా "గేమ్ ఛేంజర్" సినిమా తెరకెక్కుతోంది. దీనికి కార్తీక్ సుబ్బరాజు కథ అందించారు. ఇందులో రామ్ చరణ్ తండ్రీకొడులుగా నటించారు. కియారా, అంజలి హీరోయిన్లుగా నటించగా.. ఎస్.జె సూర్య విలన్ పాత్ర పోషించారు. శ్రీకాంత్, జయరామ్, సముద్రఖని, సునీల్, నవీన్ చంద్ర, వీకే నరేష్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. తిరు, రత్నవేలు సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి సమీర్ మహ్మద్, రూబెన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్ రాజు బ్యానర్ లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమాని 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

## సలార్‌లో మిస్ అయినా రాజాసాబ్‌లో నిలిచింది

తమిళ్‌లో స్టార్ హీరోలకు, సూపర్ స్టార్ హీరోలకు జోడీగా నటించడం ద్వారా టాప్ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. ఈ అమ్మడు చాలా ఏళ్లుగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తుంది. తెలుగు లో ఈ అమ్మడు ఒక్క సినిమా చేయకున్నా మంచి గుర్తింపును దక్కించుకుంది. డబ్బింగ్ సినిమాలతో దక్కిన గుర్తింపుతో టాలీవుడ్‌లో మంచి ఎంట్రీకి ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. సలార్ సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ అమ్మడు కొన్ని కారణాల వల్ల తప్పింది. కానీ అదృష్టం కొద్ది రాజాసాబ్ సినిమాతో ప్రభాస్‌తో కలిసి టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ మాట్లాడుతూ... నాకు బాహుబలి 1 మరియు బాహుబలి 2 సినిమాలు అంటే చాలా ఇష్టం. అప్పటి నుంచి ప్రభాస్ గారితో వర్క్ చేయాలని కోరుకున్నాను. ఆయన అంటే అమితమైన అభిమానం నాకు ఉంది. అందుకే ఆయనతో వర్క్ చేయడం కోసం ఎదురు చూశాను. అనుకోని అవకాశం అన్నట్లుగా ఒకసారి ప్రశాంత్ నీల్ సర్ సలార్ సినిమాలో నటించాలి అంటూ అడిగారు. తాను సైతం



సినిమా కోసం రెడీ అన్నట్లుగా ఎదురు చూశాను, కానీ కొన్ని కారణాల వల్ల సినిమాను చేయలేక పోయాను. కానీ కొన్నాళ్ల తర్వాత మారుతి సర్ కాల్ చేసి రాజాసాబ్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. ప్రభాస్ సర్‌తో నటించాలి అనే కోరిక రాజాసాబ్ తో తీరింది. ఆ సినిమాలో తన పాత్ర గురించి ఇప్పుడు చెప్పలేను. కానీ సినిమా చాలా బాగుంటుంది అని హామీ ఇచ్చింది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయ్యింది అని, తన పోర్షన్ షూటింగ్ సైతం పూర్తి అయ్యిందని చెప్పుకొచ్చింది. త్వరలోనే సినిమా నుంచి మారుతి గారు అప్‌డేట్ ఇస్తారని ఆమె హామీ ఇచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో ఇదో స్పెషల్ మూవీగా ఉంటుంది అంటూ యూనిట్ సభ్యులు పదే పదే చెబుతున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుంది అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరూ చాలా నమ్మకంగా చెబుతున్నారు. రాజాసాబ్ సినిమాలో ప్రభాస్‌తో పాటు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇక హీరోయిన్‌గా మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్ రిద్ధి లు నటిస్తున్నారు. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సలార్, కల్కి 2898 ఏడీ వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాల తర్వాత ప్రభాస్ నుంచి రాబోతున్న సినిమా ఇదే కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. 2025లోనే రాజాసాబ్ తో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

## మీనాక్షి చౌదరి.. ఎట్టకేలకు ఒక పెద్ద హిట్..

హీరోయిన్ మీనాక్షి చౌదరి.. ఈ హర్యానా బ్యూటీ యంగ్ హీరో సుశాంత్ ఇచ్చట వాహనములు నిలపరాదు మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అవుట్ ఆఫ్ లవ్ వెబ్ సిరీస్ తో యాక్టింగ్ కెరీర్ స్టార్ట్ చేసిన బ్యూటీ.. అప్ స్టార్ట్స్ మూవీతో బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత రెండేళ్ల గ్యాప్ లో తెలుగు సినీ ప్రియులకు హీరోయిన్ గా పరిచయమయ్యారు. తన అందం, అభినయంతో మెప్పించారు. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజతో నటించే ఛాన్స్ దక్కించుకున్నారు మీనాక్షీ చౌదరి. ఖిలాడీ సినిమాలో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. అదే ఏడాది అడివి శేష్ తో హిట్– ది సెకండ్ కేస్ మూవీలో నటించి మెప్పించారు. తన కెరీర్ లో తొలి హిట్ ను సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత కొలై సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. 2024 ఏడాది సంక్రాంతికి గుంటూరు కారం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. త్రివిక్రమ్ డైరెక్షన్ లో తెరకెక్కిన గుంటూరు కారంలో సెకండ్ హీరోయిన్ గా నటించారు. పెద్దగా స్కోప్ లేని రోల్ లో కనిపించినా.. తన యాక్టింగ్



తో మెప్పించారు. రీసెంట్ గా విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో నటించారు. కానీ సాంగ్స్, మూడు సీన్స్ కే పరిమితమయ్యారు. ఇప్పుడు చేతి నిండా సినిమాలతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుస ప్రాజెక్టుల్లో మీనాక్షి నటిస్తున్నారు. దీపావళి కానుకగా లక్కీ భాస్కర్ చిత్రంతో ఇప్పుడు థియేటర్లలో సందడి చేస్తున్నారు. మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన నటించారు. యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఆ మూవీ ప్రీమియర్స్ షోస్ నిన్ననే పడ్డాయి. సినిమా అదిరిపోయిందని అంతా రివ్యూస్ ఇస్తున్నారు. చాలా బాగుందని చెబుతున్నారు. మీనాక్షి యాక్టింగ్ సూపర్ అని కొనియాడుతున్నారు. అదే సమయంలో ఎట్టకేలకు మీనాక్షి చౌదరి మంచి హిట్ అందుకున్నారని నెటిజన్లు అంటున్నారు. వాస్తవానికి అది నిజమే.. హిట్–2 తర్వాత మీనాక్షి ఇప్పుడే సరైన హిట్ ను దక్కించుకున్నారు. అదే సమయంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ప్రస్తుతం మెకానిక్ రాకీ చిత్రంలో నటిస్తున్నారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన పాన్ ఇండియా మూవీ మట్కాలో యాక్ట్ చేస్తున్నారు. వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ లో కనిపించనున్నారు. మెగాస్టార్ చిరంజీవి విశ్వంభరలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చినా.. అది నిజం కాదని రీసెంట్ గా మీనాక్షి క్లారిటీ ఇచ్చారు. మరి ముద్దుగుమ్మ.. ఫ్యూచర్ లో ఇంకెన్ని హిట్స్ అందుకుంటారో చూడాలి.



# తెలంగాణపై పోలవరం ప్రాజెక్టు ప్రభావం.. అధ్యయనానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో వచ్చిన వరదల వల్ల భద్రాచలం ముంపునకు గురైందని, 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అధికారులు సీఎం దృష్టికి తసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం కొత్తగా బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోందని.. ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు వివరించారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ సీఎస్‌కు తెలపాలని, అవసరమైతే గోదావరి బోర్డు, కేంద్ర జలశక్తిశాఖకు లేఖలు రాయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.



# సినిమాల పేర్లు తెలుగులో ఉండాలి


హైదరాబాద్: మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలతో రోజూ బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిజిటల్ విభాగంలో తెలుగు భాష క్రోడీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగంలో మాతృ భాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలని పేర్కొన్నారు. "వికీపీడియాలో తెలుగు వ్యాసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కథలు, వ్యాసాలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయి. తెలుగు కనుమరుగు కాకముందే పరిరక్షించుకోవాలి. బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలి. పాలన, అధికార వ్యవహారాలు తెలుగులో జరగాలి. కొత్త సాంకేతికత, కార్యక్రమాలను మాతృభాషలోనే చేపట్టాలి. వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉంది. 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయి. మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలో విద్య ఉండాలి. కేంద్రం తెచ్చిన కొత్త విధానాన్ని అమలు చేయాలి. ప్రాంతీయ భాష పరిరక్షణకు పెద్దల సహకారం కావాలి. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో ఉండాలి. కోర్టు తీర్పులు, సినిమాల పేర్లు తెలుగులో ఉండాలి" అని కిషన్ రెడ్డి అన్నారు.



# యాదగిరిగుట్టలోని పరిశ్రమలో పేలుడు

పెద్దకందుకూరు: యాదగిరిగుట్ట మండలంలోని ఓ పరిశ్రమలో పేలుడు సంభవించింది. పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌క్లూజివ్ పరిశ్రమలో పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కనకయ్య అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఆయన్ను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. యాజమాన్యం ఎమర్జెన్సీ సైరన్‌తో కార్మికులను అప్రమత్తం చేసింది. పలువురు క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుప్రతులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. ప్రమాదం గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. గత మూడేళ్ల వ్యవధిలో ఐదుగురు కార్మికులు చనిపోయారని.. కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి కంపెనీలు ధనార్జన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలో అంబులెన్స్ కూడా లేదన్నారు. ప్రమాదాల నివారణపై యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు. ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# వణికిస్తున్న చలి.. పటాన్‌చెరులో అత్యల్పం



హైదరాబాద్ సిటీ: శివారు ప్రాంతాల్లో చలితీవ్రత పెరిగింది. పటాన్‌చెరులో అత్యల్పంగా 8.4 సెల్సియస్ డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా రాజేంద్రనగర్ ప్రాంతంలో 10 సెం.మీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో సాధారణంగా 5 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చలిగాలులతో రాత్రుళ్లు బయట అడుగుపెట్టేందుకు ప్రజలు వణికిపోతున్నారు. కాగా, బేగంపేటలో 13.6, దుండిగల్‌లో 13.8, హయత్‌నగర్‌లో 14, హకీంపేటలో 14.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం వేళల్లో పొగమంచు ప్రధాన రహదారులను కప్పేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు గ్రేటర్‌లో వాతావరణం ఇదే తరహాలో ఉంటుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

# రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే కేటీఆర్‌పై కేసు : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట : రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. దేశంలో అతి చెత్త కేసుల్లో మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదైన కేసు తప్ప మరొకటి లేదన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బడే బాయ్, చోటే బాయ్ కలిసి ఏం పనులు చేస్తున్నారో ప్రజలు గమమనిస్తున్నారు. అయినా వీళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇచ్చినోడు తెలుసంట.. తీసుకున్నోడు తెలవదంట.. ఇది ఏం కేసో రేవంత్ రెడ్డికే తెలియాలి. తీసుకున్నోడు వచ్చి రేవంత్ రెడ్డిని కలిసిండు కాబట్టి ఆయనపై కేసు లేదు.. ఇందులో మొదటి నేరస్థుడు రేవంత్ రెడ్డి అందులో ఎలాంటి సందేహం లేదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా ఎగ్గొట్టడానికి, రైతులను పక్కదారి పట్టించేందుకే కేటీఆర్‌పై పెట్టిన కేసును ముందుకు తీసుకువస్తున్నాడని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. రుణమాఫీ జాబితాను ఫైనాన్స్ సెక్రటరీ సంతకం పెట్టి విడుదల చేయాలి. రుణమాఫీ కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి మాత్రం అందరికీ రుణమాఫీ చేశామని చెబుతుండు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతు రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు పెట్టలేదు.. ఇప్పుడు నిబంధనలు పెడుతున్నారు. రుణమాఫీ విషయంలో రూ. 46 వేల కోట్లు అని చెప్పి రూ. 36 వేల కోట్లు కేటాయించి, రూ. 26 వేల కోట్లు క్యాబినెట్లో ఆమోదించి రూ. 18 వేల కోట్లను విడుదల చేసి 12 వేల కోట్లను మాత్రమే మాఫీ చేశారని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ తెచ్చిన ప్రతి అప్పుకు ఆస్తి ఉందని, సంవత్సర కాలంలో మీరు తెచ్చిన రూ. 1,28,000 కోట్లతో ఎక్కడైనా ఒకచోట ఒక్క ఆస్తి నిర్మాణమైన చేశారా చెప్పాలి.. కొత్త పథకం ఏమైనా ఇచ్చారా చెప్పాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏ పథకానికి ఒక రూపాయి ఇవ్వకుండా ఢిల్లీకి కొన్ని, మీరు కొన్ని పంచుకొని రాష్ట్ర ప్రజల నెత్తిన అప్పు వేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి ఒక ఉద్యోగం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న ప్రజాప్రతినిధులను ప్రతి వర్గం నిలదీయాల్సిన అవసరం ఉంది అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.



# పొగమంచు ఎఫెక్ట్.. 200 విమానాలు ఆలస్యం

దిల్లీ: ఉత్తర భారతంపై చలి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో మంచు దట్టంగా కురుస్తోంది. దిల్లీతో పాటు పలు రాష్ట్రాలపై పొగమంచు కమ్మేసింది. దీంతో విమాన, రైల్వే సేవలకు అంతరాయం ఏర్పడింది. దిల్లీ ఎయిర్‌పోర్టు లో విజిబిలిటీ సున్నాకు పడిపోయింది. దీంతో విమానాశ్రయంలో సేవలకు తాత్కాలికంగా నిలిపివేశారు. ఫలితంగా దాదాపు 200లకు పైగా విమానాలుఆలస్యంగా నడుస్తుండగా.. మరో 30 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. "పొగమంచు కారణంగా ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలపై ప్రభావం పడింది. విమాన సమయాల కోసం ప్రయాణికులు ఎప్పటికప్పుడు సంబంధిత ఎయిర్‌లైన్లను సంప్రదించాలి" అని ఎయిర్‌పోర్టు అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అటు ఇండిగో, ఎయిర్‌ఇండియా సంస్థలు కూడా ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. అటు కోల్‌కతా, చండీగఢ్, అమృత్‌సర్, జైపూర్ సహా ఉత్తర భారతంలోని పలు విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో 25 విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. మరోవైపు, రైల్వే సేవలు కూడా నెమ్మదిగా సాగుతున్నాయి. మంచు కారణంగా దిల్లీకి వెళ్లే దాదాపు 50కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్, కర్నాల్, గాజియాబాద్ తదితర ప్రాంతాల్లో ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి ఉంది. దీంతో వాహనాల రాకపోకలపై ప్రభావం పడి పలుచోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దిల్లీలో శనివారం తెల్లవారుజామున 10.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పటికే వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనవరి 8వ తేదీ వరకు దేశ రాజధానిలో మంచు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మధ్యలో తేలికపాటి వర్షాలు కూడా పడొచ్చని తెలిపింది.

# కేజ్రీవాల్‌కు పోటీగా మాజీ ఎంపీ.. దిల్లీ ఎన్నికలకు భాజపా తొలి జాబితా



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ ప్రకటించనప్పటికీ.. రాజకీయ వేడి మాత్రం రాజుకుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తున్నాయి. తాజాగా భారతీయ జనతా పార్టీ దిల్లీ ఎన్నికలకు అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పోటీగా మాజీ ఎంపీని బరిలోకి దింపింది. తొలి జాబితాలో 29 స్థానాలకు భాజపా అభ్యర్థులను ప్రకటించింది. న్యూదిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ పర్వేశ్‌వర్మ పేరును ఖరారు చేసింది. ఇదే స్థానం నుంచి ఆప్ నేత కేజ్రీవాల్ పోటీ చేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ కూడా ఈ స్థానానికి మాజీ సీఎం షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ పేరును ప్రకటించింది. దీంతో ఈసారి ఎన్నికల్లో న్యూదిల్లీ నియోజకవర్గ పోరు ఆసక్తికరంగా మారింది. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడైన పర్వేశ్ వర్మ.. 2014 నుంచి 2024 వరకు పశ్చిమ దిల్లీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈయన రికార్డు స్థాయిలో 5.78 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దిల్లీ చరిత్రలో ఓ లోక్‌సభ అభ్యర్థి సాధించిన అత్యధిక మెజార్టీ ఇదే కావడం విశేషం. ఇక, దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీకి పోటీగా కల్కాజీ స్థానం నుంచి మరో మాజీ ఎంపీ రమేశ్ బిధూడీని నిలబెట్టింది. ఇటీవలే ఆమ్‌ఆద్మీ పార్టీ నుంచి భాజపాలో చేరిన మాజీ మంత్రి కైలాశ్ గహ్లోత్‌కు ఈ ఎన్నికల్లో టికెట్ దక్కింది. బిజ్వాసన్ నుంచి ఆయన పోటీ చేయనున్నట్లు భాజపా ప్రకటించింది. దిల్లీ కాంగ్రెస్ మాజీ చీఫ్ అరవింద్ సింగ్లీ లవ్లీ కూడా గతేడాది కమలదళంలో చేరగా.. తాజా జాబితాలో గాంధీనగర్ స్థానం నుంచి నిలబెట్టింది. 70 శాసనసభ స్థానాలు ఉన్న దిల్లీ ప్రస్తుత అసెంబ్లీ గడువు ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియనుంది. మరికొన్ని రోజుల్లో ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆమ్‌ఆద్మీ పార్టీ మొత్తం అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ కూడా కొంతమందిని ప్రకటించింది.

# హైడ్రా మరో కీలక నిర్ణయం..



హైదరాబాద్, జనవరి 4: హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఎల్లుండి (జనవరి 6) నుంచి హైడ్రా ప్రధాన కార్యాలయం బుద్ధ భవన్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్. తొలిసారిగా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదు స్వీకరించనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్న 2:00 గంటల వరకు ఫిర్యాదులను హైడ్రా చీఫ్ స్వీకరించనున్నారు. అలాగే వారం రోజుల్లో హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంక్రాంతి నుంచి హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. హైడ్రా పీఎస్ ఏర్పాటుపై రేపు (ఆదివారం) అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను 10 రోజుల్లోపు పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల ఫిర్యాదులపై హైడ్రా స్పెషల్ ఫోకస్ పెట్టింది. న్యాయ వివాదాలు లేకుండా పకడ్బందీగా ఫిర్యాదులను పరిష్కరించాలని హైడ్రా నిర్ణయించింది. హైడ్రా మరో ముందడుగు వేసింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు హైడ్ర గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసింది. ఇకపై హైడ్రా గ్రీవెన్స్ ప్రతీ సోమవారం ఉండనున్నట్లు సమాచారం. దీంతో పాటు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హైడ్రా పోలీస్‌స్టేషన్ కూడా సంక్రాంతికి ప్రారంభంకానుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇకపై హైడ్రాకు సంబంధించిన కార్యకలాపాలు పూర్తిగా కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా నిర్వహించేందుకు వీలుగా హైడ్రా కమిషన్ రంగనాథ్ నిర్ణయం తీసుకున్నారు. సంక్రాంతి నుంచి హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా సేవలను అందుబాటులో ఉంచనున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా గ్రీవెన్స్‌కు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొననున్నారు. బుద్ధభవన్‌లో జరుగనున్న ఈ గ్రీవెన్స్‌లో ముఖ్యంగా నాలాలు, చెరువులు, ఇతర ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులు ఏవి వచ్చినా సరే న్యాయపరంగా ఇబ్బందులు కాకుంగా వారం నుంచి పది రోజుల్లోపు ఫిర్యాదుదారులు ఇచ్చిన కంప్లైంట్‌లను క్లియర్ చేసే విధంగా హైడ్రా ఓ ప్రణాళికను రూపొందించినట్లు తెలుస్తోంది. గత నెలలోనే హైడ్రా గ్రీవెన్స్ ప్రారంభంకావాల్సి ఉంది. కొంత ఆలస్యమైనప్పటికీ కూడా హైడ్రా గ్రీవెన్స్‌తో పాటు హైడ్రా పోలీస్‌స్టేషన్ అందుబాటులోకి రానుంది. డీఎస్పీ స్థాయి అధికారి, ఎస్పీ స్థాయి అధికారితో పాటు సీఐలు, ఎస్ఐలు కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండనున్నారు. చెరువుల ఆక్రమణలు, నాలాల కబ్జాలు, కుంటల కబ్జాలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే పరిష్కరించాలని హైడ్రా నిర్ణయించింది. హైడ్రా ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఐదువేలకు పైగా ఫిర్యాదు వచ్చాయి. ఇందులో అత్యధికంగా నగర శివారుల ప్రాంతాలైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి ఎక్కువగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి స్థానిక ఎమ్మార్వోలు, రెవెన్యూ సిబ్బంది గ్రీవెన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. వారు హాజరుకానిపక్షంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు. మరోవైపు ఆక్రమణలపై హైడ్రా మరింత దూకుడుగా ముందుకు పోతోంది. ఇటీవల కాలంలో ఖాజాగూడ, మల్కాజ్‌గిరిలో ఆక్రమణలను హైడ్రా కూల్చివేసింది. హైడ్రా వద్దకు వస్తే తప్పకుండా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఫిర్యాదుదారుడు అనుకోవాలనే ఉద్దేశంతో హైడ్రా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# కాళేశ్వరంపై ఇప్పటికైనా చంపలేసుకోండి... సర్కార్‌పై కేటీఆర్ విసుర్లు

హైదరాబాద్, జనవరి 4: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వరుస ట్వీట్‌లతో దూసుకెళ్తున్నారు. ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పాలన, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు రేవంత్ సర్కార్‌పై దుమ్మెత్తి పోస్తూనే ఉన్నారు. తాజాగా కాళేశ్వరంపై ట్వీట్ చేశారు కేటీఆర్. కాళేశ్వరం అంతా అవినీతిమయం అని, భారీ కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడంపై అధికారంలోకి రాకముందే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది కాంగ్రెస్. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరంలో జరిగిన అవకతవకలను బయటపెడాతమని చెప్పిన రేవంత్.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ ఓ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

ఇప్పటికే జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం కమిషన్ విచారణను కొనసాగిస్తోంది. కాళేశ్వరం నిర్మాణంలో భాగస్వాములైన అప్పటి నీటిపారుదలశాఖ అధికారులు, ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు, మాజీ ఐఏఎస్‌లు, ప్రస్తుత ఐఏఎస్ అధికారులను విచారించింది. ఇంకా కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతూనే ఉంది. అయితే కాళేశ్వరంపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై మరోసారి విరుచుకుపడ్డారు కేటీఆర్. కాళేశ్వరంపై ఎంత విషం చిమ్మినా తెలంగాణ ప్రజల దాహార్తి తీరుస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని ప్రచారం చేస్తున్నారని.. అయినప్పటికీ కాళేశ్వరం తెలంగాణను సస్యశ్యామలం చేసిందన్నారు. కాళేశ్వరంలో భారీగా కుంభకోణం జరిగిందనేది అబద్ధపు ప్రచారమే అని ఎక్స్ వేదికగా కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



నల్లగొండ : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. మిర్యాలగూడెం మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన గందం శ్రీనివాస్ (33) నల్గొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తుండగా, అదే వైపు నుంచి వస్తున్న కారు మిర్యాలగూడ వైపు అతివేగంగా వెళతూ వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. అనంతరం కారు రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. కారు నుజ్జునుజ్జు కాగా%ో% ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శ్రీనివాస్ కొద్ది దూరంలో ఎగిరిపడి చనిపోయారు. కారులో ఉన్న మరో మహిళ సైతం కారులో నుంచి ఎగిరి పక్కనే ఉన్న పొలాల్లో పడి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. కారులోని మరో ఇద్దరికి సీరియస్‌గా ఉండటంతో, చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com